SAMAYAM

epaper.samayamdaily.net
APTEL/26/A3949

# సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.
7036644111, 9490140565

సంపుటి: 1 | సంచిక: 80 | ఎడిటర్ : అలీ ముర్తుజా | శనివారం 26 సెప్టెంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |



# చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలి

## ఎన్నికల సంఘంపై కాంగ్రెస్, సీజేపీ కన్నెర్ర



- జ్ఞానేష్ కుమార్‌పై విచారణ చేపట్టాలని డిమాండ్
- దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల భారీ నిరసనలు
- రాష్ట్ర ఈసీ కార్యాలయాల ముట్టడికి యత్నం
- రాజీనామా చేయకపోతే అక్టోబర్ 2 నుంచి ఆందోళనలు
- ఈసీ వ్యవహార శైలిపై ప్రతిపక్షాల తీవ్ర అభ్యంతరం

వివరాలు 3లో..

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్, ఇతర పార్టీలు ఉద్యమిస్తున్నాయి. ఆయన తక్షణమే పదవికి రాజీనామా చేయాలని, అరెస్టు చేసి విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ శుక్రవారం దేశవ్యాప్తంగా భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించింది.జమ్మూ కశ్మీర్, అస్సాం, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, ఉత్తర్ ప్రదేశ్, చండీగఢ్, మణిపూర్ తదితర రాష్ట్రాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు భారీ ర్యాలీలు నిర్వహించి, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయాలను ముట్టడించేందుకు యత్నించారు.

- సమయం న్యూస్, న్యూ ఢిల్లీ

# సీఈసీపై క్రిమినల్ కేసు పెట్టండి!

- జ్ఞానేశ్ కుమార్‌పై సుప్రీంకోర్టులో పిల్..
- ఓటర్ల జాబితా సవరణపై విచారణకు డిమాండ్

4



# క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ బెస్ట్

- టోరెంట్ గ్రూప్ చైర్మన్ సమీర్ మెహతాతో మంత్రి నారా లోకేష్ భేటీ
- గ్రీన్ హైడ్రోజన్, సోలార్ ప్రాజెక్టుల కోసం రాష్ట్రానికి ఆహ్వానం
- విశాఖలో జీసీసీని ఏర్పాటు చేయాలని వెల్స్‌పన్ సీఈఓకు విజ్ఞప్తి
- కాకినాడలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుపై నితిన్ జైన్‌తో చర్చ
- నెల్లూరులో రిఫైనరీల కోసం గోకుల్ ఆగ్రో చైర్మన్‌తో మంత్రి భేటీ



**అహ్మదాబాద్ (సమయం న్యూస్):** రాష్ట్రంలో భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఏపీ విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ గుజరాత్ పర్యటనలో ముమ్మరంగా శ్రమిస్తున్నారు. బుధవారం అహ్మదాబాద్‌లో ఆయన టోరెంట్, వెల్స్‌పన్, గోకుల్ ఆగ్రో తదితర ప్రతిష్ఠాత్మక సంస్థల చైర్మన్లు, సీఈవోలతో వేర్వేరుగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఉన్న అపార అవకాశాలను వారికి వివరించి, భారీ ప్రాజెక్టుల స్థాపనకు ఆహ్వానించారు. ఫార్మా, పవర్, గ్యాస్ రంగాల్లో పేరొందిన టోరెంట్ గ్రూప్ చైర్మన్ సమీర్ మెహతా,

మిగతా 2 లో



# ఏ ఒక్కరినీ విడిచిపెట్టం

- దాడులు చేసింది వైసీపీ గూండాలే : మంత్రి సవిత

03

# 24 గంటల్లోపే రైతుల ఖాతాల్లో డబ్బులు

- ధాన్యం సేకరణకు పకడ్బందీ ఏర్పాట్లు!
- పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

02





# దుర్గమ్మ కొండపై విరిగిపడ్డ రాళ్లు!

ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డులో కొండచరియల కలకలం

2

# ఉత్తరాంధ్రను వణికించిన వాయుగుండం

- వరదలో చిక్కుకున్న ఎమ్మెల్యే కూన రవికుమార్, కలెక్టర్, ఎస్పీ
- బోటు ద్వారా సురక్షితంగా కాపాడిన ఎన్డీఆర్ఎఫ్ బృందాలు
- సాలూరులో ముంపు ప్రాంతాలను పరిశీలించిన మంత్రి

వివరాలు 2లో



శ్రీకాకుళం జిల్లాలో వరద పరిస్థితిని పరిశీలించేందుకు వెళ్లిన టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండకర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఒక్కసారిగా వరద ప్రవాహంలో చిక్కుకున్నారు.



# పంట నష్టంపై వెంటనే సర్వే!

- నష్టాల అంచనా వేగంగా పూర్తి చేయాలి
- అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం

వివరాలు 3లో

# మహిళల భద్రతకే ఎన్డీఏ సర్కారు ప్రాధాన్యం



03

హోం మంత్రి వంగలపూడి అనిత

అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో పర్యటన

రూ. 4.30 కోట్లతో రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన

# ఈసీపై విశ్వాసం పునరుద్ధరించాలి



ఎన్నికల కమిషనర్ల ఎంపికలో సీజేఐ ఉండాలి!

కేంద్రానికి వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ విజ్ఞప్తి

3

# టూరిజంలో ఏఐ.. కొత్త శకానికి సై!

- మంత్రి కందుల దుర్గేష్

2



# భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతి!

3



వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో హీలింగ్ అండ్ డివోషనల్ సెంటర్

టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

# ఉత్తరాంధ్రను వణికిస్తున్న వాయుగుండం!

**వరదలో చిక్కుకున్న ఎమ్మెల్యే కూన రవికుమార్, కలెక్టర్, ఎస్పీ**

**బోటు ద్వారా సురక్షితంగా కాపాడిన ఎన్డీఆర్ఎఫ్ బృందాలు**

**పార్వతీపురంలో 9 నెలల గర్భిణి ప్రాణాల రక్షణ**

**సాలూరులో ముంపు ప్రాంతాలను పరిశీలించిన మంత్రి**



**శ్రీకాకుళం (సమయం న్యూస్):** ఉత్తరాంధ్రలో వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఎడతెరపి లేకుండా వానలు పడుతుండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు, వంకలు పొంగిపొర్లడంతో పలుచోట్ల ఆకస్మిక వరదలు సంభవించాయి. శ్రీకాకుళం జిల్లాలో వరద పరిస్థితిని పరిశీలించేందుకు వెళ్లిన టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండకర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఒక్కసారిగా వరద ప్రవాహంలో చిక్కుకున్నారు. పరిస్థితి ప్రమాదకరంగా మారడంతో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తమై మరో బోటులో అక్కడికి చేరుకున్నాయి. తీవ్రంగా శ్రమించి ఎమ్మెల్యే, అధికారులను సురక్షితంగా రక్షించాయి. ఎమ్మెల్యే వరదలో చిక్కుకున్నారన్న విషయం తెలియగానే టీడీపీ శ్రేణుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. మరోవైపు పార్వతీపురంలో ఆకస్మిక వరదల్లో 9 నెలల గర్భిణి భూమిక చిక్కుకుపోగా, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సాహసోపేతంగా ఆమెను రక్షించారు. వెంటనే ఆమెకు లైఫ్ జాకెట్ వేసి సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన అనంతరం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఇక సాలూరులో ఆర్టీసీ కాంప్లెక్స్ పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకోవడంతో మంత్రి గుమ్మడి సంధ్యారాణి స్వయంగా పరిస్థితిని పరిశీలించారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సాలూరులో దెబ్బతిన్న రోడ్లు, చెరువులు, పంటలు, ఇళ్ల పరిస్థితిపై మంత్రి అధికారులను అడిగి ఆరా తీశారు.

# దుర్గమ్మ కొండపై విరిగిపడ్డ రాళ్లు!

**ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డులో కొండచరియల కలకలం**

**2 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ముప్పు**

**3 రోజుల ముందే మూసివేసిన అధికారులు**

**అమ్మవారి దయతో తప్పిన భారీ ప్రాణనష్టం**

**ఘటనా స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్ లక్ష్మీశ, ఈవో**



**విజయవాడ (సమయం న్యూస్):** విజయవాడ నగరంలో గత 2 రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని భారీ వర్షాల కారణంగా గురువారం రాత్రి ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడ్డాయి. రానున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఘాట్ రోడ్డు మరమ్మతుల కోసం 3 రోజుల క్రితమే అధికారులు ఆ మార్గాన్ని పూర్తిగా మూసివేశారు. దీంతో శ్రీ కనకదుర్గ అమ్మవారి దయ వల్ల ఎవరికీ ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పెను ప్రమాదం తప్పింది.

### హుటాహుటిన పరిశీలించిన కలెక్టర్..

కొండచరియలు విరిగిపడిన సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, దేవస్థాన ఈవో వి.కె. శీనా నాయక్ శుక్రవారం ఉదయం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఘాట్ రోడ్డును స్వయంగా పరిశీలించారు. కొండపై నుంచి కిందకు జారిపడిన భారీ బండరాళ్లు, రాతిపెళ్లలు, మట్టిని వెంటనే పొక్లెయిన్లు, క్రేన్ల సహాయంతో యుద్ధప్రాతిపదికన తొలగించి మార్గాన్ని శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. కొండచరియలపై వర్షపు నీటి ఊట కారణంగా మట్టి పూర్తిగా నానిపోయి ఉందని, భవిష్యత్తులో ఎక్కడైనా రాళ్లు జారే అవకాశాలు ఉన్నాయా అనే అంశాన్ని సాంకేతిక నిపుణులతో క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ప్రమాదకరంగా వదులుగా ఉన్న రాళ్లను ముందుగానే గుర్తించి జాగ్రత్తగా తొలగించాలన్నారు.

### భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు..

కొండచరియలు పడిన ప్రాంతంలో రక్షణ గోడ (రిటైనింగ్ వాల్), ఐరన్ ఫెన్సింగ్, రాక్-ఫాల్ నెట్లను మరింత పటిష్టంగా పునరుద్ధరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో భద్రతా తనిఖీలు పూర్తయ్యే వరకు ఘాట్ రోడ్డు వైపునకు ఎవరినీ అనుమతించవద్దని చెప్పారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, కార్యదర్శి కె. కన్నబాబు, కమిషనర్ కె. రామచంద్ర మోహన్ తదితరులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు ఈవో శీనా నాయక్ వెల్లడించారు. ముందస్తు జాగ్రత్తల వల్లే పెద్ద ముప్పు తప్పిందని ఆయన స్పష్టం చేశారు.

# క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు ఏపీ బెస్ట్!

(మొదటిపేజీ తరువాయి..)

డైరెక్టర్లతో మంత్రి లోకేష్ భేటీ అయ్యారు. కంపెనీ తన రెన్యువబుల్ ఎనర్జీ పోర్ట్‌ఫోలియోను విస్తరించనున్న నేపథ్యంలో ఏపీలో సౌర, పవన, హైబ్రిడ్ ప్రాజెక్టుల అవకాశాలను పరిశీలించాలని కోరారు. పంప్డ్-స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్ లాంటి క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు ఏపీని ఎంపిక చేసుకోవాలని సూచించారు. వైజాగ్ ప్లాంట్‌లో ఏపీఐలు, అధునాతన ఇంటర్మీడియట్ల సామర్థ్యాన్ని పెంచాలని కోరారు. దీనిపై సమీర్ మెహతా స్పందిస్తూ.. 2030 నాటికి 10 గిగావాట్ల క్లీన్ ఎనర్జీ సామర్థ్యానికి చేరుకోవడమే తమ లక్ష్యమని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.



### కాకినాడలో వెల్స్‌పన్ ఇండస్ట్రియల్ పార్క్..

పైప్స్, స్టీల్, హోమ్ టెక్స్‌టైల్స్ రంగాల్లో పేరొందిన వెల్స్‌పన్ వరల్డ్ గ్రూప్ సీఈవో నితిన్ జైన్‌తో మంత్రి లోకేష్ సమావేశమయ్యారు. విశాఖపట్నంలో వెల్స్‌పన్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. కాకినాడలో టెక్స్‌టైల్స్, డీఐ పైపుల తయారీ, గ్రీన్ అమోనియా యూనిట్లతో ఇండస్ట్రియల్ పార్కును నెలకొల్పాలని కోరారు. గత ఏడాది దావోస్ సదస్సులో సీఎం చంద్రబాబుతో జరిగిన చర్చల పురోగతిని ఈ సందర్భంగా సమీక్షించారు. కర్నూలు, కడపలో తమ సంస్థ ఇప్పటికే 100 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టును నిర్వహిస్తోందని నితిన్ జైన్ గుర్తుచేశారు. కాకినాడ-శ్రీకాకుళం గ్యాస్ పైప్‌లైన్ కోసం పైపుల సరఫరా చేస్తున్నామని, తాజా ప్రతిపాదనలు సానుకూలంగా పరిశీలిస్తామని తెలిపారు.

### నెల్లూరులో ఆయిల్ రిఫైనరీల విస్తరణ..

ఎడిబుల్ ఆయిల్స్ రంగంలో ప్రఖ్యాతిగాంచిన గోకుల్ ఆగ్రో రిసోర్సెస్ ఎండీ కనుభాయ్ జె. ఠక్కర్‌తో మంత్రి భేటీ అయ్యారు. కంపెనీ ప్రస్తుత నెల్లూరు ప్లాంట్‌కు విస్తరణగా పామాయిల్, సోయాబీన్ ఆయిల్ రిఫైనరీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. గోకుల్ ఆగ్రోస్ ఏపీని పెట్టుబడి గమ్యస్థానంగా విశ్వసించినందుకు మంత్రి అభినందనలు తెలిపారు. ప్రస్తుతం కృష్ణపట్నంలో రోజుకు 1400 టన్నుల సామర్థ్యంతో తమ సంస్థ వంట నూనె రిఫైనరీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసిందని ఠక్కర్ చెప్పారు. దక్షిణాది మార్కెట్ల విస్తరణపై ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని ఆయన వెల్లడించారు.

# 24 గంటల్లోపే రైతుల ఖాతాల్లో డబ్బులు

- ధాన్యం సేకరణకు పకడ్బందీ ఏర్పాట్లు!
- రైతు సంక్షేమమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం
- సొంత వాహనాల్లో తరలిస్తే రవాణా ఛార్జీలు
- రాష్ట్రవ్యాప్తంగా 2,619 కొనుగోలు కేంద్రాలు
- పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్




**విజయవాడ (సమయం న్యూస్):** రాష్ట్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 2026-27 ఖరీఫ్ ధాన్యం సేకరణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రైతులకు న్యాయం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం విజయవాడలో నిర్వహించిన 2026-27 ఖరీఫ్ ధాన్యం సేకరణ రాష్ట్రస్థాయి సన్నద్ధత సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ధాన్యం సేకరణలో కూటమి ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చిందని మంత్రి తెలిపారు. గత ఖరీఫ్‌లో సుమారు రూ. 12 వేల కోట్ల ధాన్యం సేకరణ సొమ్మును రైతులకు 24 గంటల్లోపే చెల్లించామని, ఈసారి కూడా ఎలాంటి జాప్యం లేకుండా డబ్బులు జమ చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు తమ సొంత వాహనాల్లో కల్లాల నుంచి మిల్లులకు ధాన్యం తరలిస్తే, వారికి చెల్లించాల్సిన రవాణా ఛార్జీలను కూడా వెంటనే ఖాతాల్లో వేసేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ ఖరీఫ్‌లో రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం సేకరణ కోసం దాదాపు 31 వేల వాహనాలను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.

### 37 లక్షల టన్నుల సేకరణే లక్ష్యం..

ఈ ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి నాదెండ్ల తెలిపారు. రాష్ట్రంలో 3 రోజుల పాటు వర్షాలు కురుస్తుండటంతో ధాన్యం దిగుబడి పెరిగే అవకాశం ఉందన్నారు. ఉత్పత్తి అంచనాలను సమీక్షించి అవసరమైతే సేకరణ లక్ష్యాన్ని పెంచుతామని చెప్పారు. ధాన్యం సేకరణ కోసం 6.10 కోట్ల నాణ్యమైన గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచుతున్నామని, ఎక్కడా కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2,619 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, 24 వేల మంది సిబ్బంది రైతులకు సేవలు అందించనున్నారని వివరించారు. ఈ కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ నుపూర్ అజయ్ కుమార్, జిల్లాల జాయింట్ కలెక్టర్లు, సివిల్ సప్లై అధికారులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# టూరిజంలో ఏఐ.. కొత్త శకానికి సై!

**ఏపీ పర్యాటక రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్**

**27 న రాజమహేంద్రవరంలో పర్యాటక దినోత్సవం**

**'ది గోదావరి కాల్స్' ప్రచారానికి శ్రీకారం**

**ప్రతిష్టాత్మకంగా ఏపీ టూరిజం అవార్డుల ప్రదానం**

**టూరిజం మంత్రి కందుల దుర్గేష్ కీలక ప్రకటన**

**రాజమహేంద్రవరం (సమయం న్యూస్):** ఏఐ టెక్నాలజీతో ఏపీ టూరిజంలో సరికొత్త శకానికి నాంది పలుకుతున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. సెప్టెంబర్ 27 న రాజమహేంద్రవరంలోని మంజీరా కన్వెన్షన్ హాల్ వేదికగా 'డిజిటల్ అజెండా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టు రీడిజైన్ టూరిజం' గ్లోబల్ థీమ్ ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి వేడుకలకు పర్యాటక రంగానికి చెందిన ప్రముఖులు, టూర్ ఆపరేటర్లు, ఆతిథ్య రంగ ప్రతినిధులు, కంటెంట్ క్రియేటర్లు, టెక్నాలజీ ఇన్నోవేటర్లు హాజరుకానున్నారు.

### ది గోదావరి కాల్స్..




2027 గోదావరి పుష్కరాలే లక్ష్యంగా "ది గోదావరి కాల్స్" అనే పర్యాటక ప్రచార కార్యక్రమానికి ఈ వేడుకల్లో ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. గోదావరి ప్రాంత సాంస్కృతిక, ఆధ్యాత్మిక, ప్రకృతి సౌందర్యాన్ని ఈ వేదిక ద్వారా ప్రపంచానికి పరిచయం చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. రాష్ట్ర స్థాయి వేడుకల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ గొప్ప కళా వైభవాన్ని చాటేలా సాంస్కృతిక ప్రదర్శనలు, ఆంధ్రప్రదేశ్ టూరిజం అవార్డ్స్ 2026 ప్రదానోత్సవం జరగనున్నాయి. అలాగే పర్యాటక అనుభవాలను మెరుగుపరచడానికి కీలకమైన కొత్త ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు.

### కలెక్టర్లకు ఆదేశాలు..

రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు తమ పరిధిలోని పర్యాటక ఆకర్షణలు, సాంస్కృతిక వారసత్వం, ప్రత్యేక అనుభవాలను హైలైట్ చేస్తూ ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ కార్యక్రమాల ద్వారా రాష్ట్రంలో పర్యాటక రంగం మరింతగా వృద్ధి చెందుతుందని ఆశిస్తున్నట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు.



# సిక్కింలో వర్ష బీభత్సం!

**గ్యాంగ్‌టక్ (సమయం న్యూస్):** సిక్కింలో భారీ వర్షాలు తీవ్ర బీభత్సం సృష్టించాయి. గురువారం రాత్రి పలు ప్రాంతాల్లో కురిసిన కుండపోత వానలకు ఆకస్మిక వరదలు పోటెత్తాయి. వెస్ట్ సిక్కింలోని యుక్సోం-తషిడింగ్ పరిధిలోని రింబి గ్రామంలో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో పలు ఇళ్లు నేలమట్టమయ్యాయి. ఇళ్ల శకలాలు, బురదతో కూడిన వరద ప్రవాహం లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది. దీనివల్ల వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. అయితే ఈ ఘటనల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు స్పష్టం చేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రాగల కొద్ది రోజుల్లో రాష్ట్రంలో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. రాజధాని గ్యాంగ్‌టక్‌లోనూ వర్షాల ధాటికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొండచరియలు విరిగిపడి, రోడ్లపైకి భారీగా బురద వరద వచ్చి చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గ్యాంగ్‌టక్ జిల్లా విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ (డీడీఎంఏ) అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని అంచనా వేస్తున్నారు. గురువారం రింబి గ్రామాన్ని సందర్శించిన అధికారులు, ఇళ్లు దెబ్బతిన్న బాధితులను పరామర్శించారు. బోజోగ్‌హరి సమీపంలోని లూయింగ్-రంకా హైవే, లింగ్‌డింగ్, హైకోర్టు రోడ్, టీఎన్ఏ గేట్, వీఐపీ కాలనీ, పంగ్‌థాంగ్-లింగ్‌డాక్ రోడ్, పమ్రో గాన్, ఫెన్‌జాంగ్ ప్రాంతాలను పరిశీలించారు. వరదల ధాటికి వెస్ట్ సిక్కింలోని సిచీ వద్ద గల సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌తో పాటు పలు ప్రజా మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. ఎంచెయ్ స్కూల్ సమీపంలో పెద్ద ఎత్తున బురద పేరుకుపోయింది. కొండచరియలు జారకుండా ముందుజాగ్రత్త చర్యగా కొన్ని ప్రాంతాల్లో టార్పాలిన్ కవర్లను ఏర్పాటు చేశారు. రోడ్లపై పేరుకుపోయిన బురద, శిథిలాలను తక్షణమే తొలగించాలని జిల్లా కలెక్టర్, డీడీఎంఏ చైర్మన్ అధికారులను ఆదేశించారు. బాధితులకు అవసరమైన అన్ని సహాయక చర్యలు అందించాలని సూచించారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాలకు ఎవరూ వెళ్లకూడదని, ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణాలను పూర్తిగా మానుకోవాలని అధికారులు ప్రజలను హెచ్చరించారు.

# బలోద్ జిల్లాలో మృత్యుఘోష!

**బలోద్ (సమయం న్యూస్):** ఛత్తీస్‌గఢ్‌లోని బలోద్ జిల్లాలో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ధమతరి-కంకేర్ మధ్య జాతీయ రహదారి 30 పై మార్కటోలా ఘాట్ సమీపంలో వరి ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రక్కు, డీజే సిస్టమ్‌తో వెళ్తున్న పికప్ వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో 6 మంది మృతి చెందగా, మరో 7 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద ధాటికి పికప్ వాహనంతో పాటు అందులోని డీజే పరికరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. పురూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం జరిగినట్లు బలోద్ అదనపు పోలీసు సూపరింటెండెంట్ చంద్రకాంత్ గోవర్ణ ధ్రువీకరించారు. వాహనాల అతివేగం వల్లే ఈ ఘటన జరిగిందా అన్న కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పంట నష్టంపై వెంటనే సర్వే!

- భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు
- అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం
- నష్టాల అంచనా వేగంగా పూర్తి చేయాలి
- ముంపు పొలాల్లోని పంటలకు రక్షణ
- టెలీకాన్ఫరెన్స్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష



**అమరావతి (సమయం న్యూస్):** తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, ఈదురు గాలులకు దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన పంటలపై తక్షణమే క్షేత్రస్థాయి సర్వే చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. పంట నష్టాల వివరాల నమోదు (ఎన్యూమరేషన్) ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. భారీ వర్షాల ప్రభావం, పంటలకు జరిగిన నష్టం, తక్షణం చేపట్టాల్సిన చర్యలపై ఆయన శుక్రవారం ఉన్నతాధికారులతో ప్రత్యేక టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య శాఖలు సమన్వయంతో పనిచేసి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సూచించారు.

### పంటల రక్షణకు ముందస్తు చర్యలు..

ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు రైతులకు అందుబాటులో ఉండి, పంటలను కాపాడేందుకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలని మంత్రి స్పష్టం చేశారు. పొలాల్లో నీరు నిలిచిన ప్రాంతాలను వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు వెంటనే సందర్శించాలన్నారు. పంటల పరిస్థితిని పరిశీలించి, నిల్వ నీటిని తొలగించడం, అధిక తేమ వల్ల మరింత నష్టం వాటిల్లకుండా నివారించడం లాంటి అంశాలపై రైతులకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. పంటల రక్షణకు అనుసరించాల్సిన పద్ధతులను నేరుగా వివరించాలని పేర్కొన్నారు.

### వర్షపు నీటి సంరక్షణ..

రాష్ట్రంలో నెలకొన్న నీటి ఎద్దడి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, ప్రస్తుతం కురుస్తున్న వర్షపు నీటిని సాధ్యమైనంత మేర సంరక్షించుకోవాలని మంత్రి ఆదేశించారు. పంటలకు హాని కలిగించే నిల్వ నీటిని తొలగిస్తూనే, భవిష్యత్తు సాగు అవసరాలకు ఉపయోగపడేలా జల సంరక్షణ చర్యలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అందుబాటులోకి వచ్చిన నీటిని సమర్థంగా వినియోగించుకునే విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలని అచ్చెన్నాయుడు దిశానిర్దేశం చేశారు.



# ఏ ఒక్కరినీ విడిచిపెట్టం!

### దాడులు చేసింది వైసీపీ గూండాలే
### కోర్టు తీర్పు వచ్చినా మెగా డీఎస్సీపై తప్పుడు ప్రచారం
### రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉక్కుపాదం
### శాప్ ఆఫీసులో టీచర్లపై దాడిపై మంత్రి సవిత ఫైర్

**అనంతపురం (సమయం న్యూస్):** విజయవాడ శాప్ కార్యాలయంలో ఉపాధ్యాయులపై దాడి చేసిన వారిలో డీఎస్సీ అభ్యర్థులు ఎవరూ లేరని, వారంతా గొడ్డలి పార్టీ (వైసీపీ) గూండాలేనని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడిన ఏ ఒక్కరినీ విడిచిపెట్టే ప్రసక్తే లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎస్సీ వ్యవహారంలో ఎటువంటి అక్రమాలు జరగలేదని కోర్టు చెంపపెట్టు లాంటి తీర్పు ఇచ్చినా.. జగన్, ఆ పార్టీ నాయకులు సిగ్గు లేకుండా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆమె విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు.

### పోలీసులకు పూర్తి స్వేచ్ఛ..

అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం జంతులూరులోని 14 వ బెటాలియన్‌లో శుక్రవారం ఏపీఎస్పీ ఎస్సీటీపీసీ 2025-26 బ్యాచ్‌కు చెందిన 187 మంది శిక్షణార్థుల పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే బండారు శ్రావణితో కలిసి మంత్రి సవిత విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబుకు పోలీసులంటే అపారమైన గౌరవమని, విధి నిర్వహణలో వారికి పూర్తి స్వేచ్ఛనిచ్చారని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులదే కీలక పాత్ర అని ఆమె పేర్కొన్నారు. గత వైసీపీ పాలనలో పోలీసులు తీవ్ర ఒత్తిడితో విధులు నిర్వర్తించారని గుర్తుచేశారు. నిరుద్యోగుల కోసం ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తామని, అందులో భాగంగానే పోలీసు శాఖలో పోస్టులు భర్తీ చేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 6100 పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తుచేశారు. ఇటీవల 2050 ఎస్ఐ, ఇతర కానిస్టేబుల్ పోస్టులకు కూడా నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఆమె వెల్లడించారు.

# భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతి!

### వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో హీలింగ్ అండ్ డివోషనల్ సెంటర్
### స్వామివారి వైభవంపై త్రీడీ, వర్చువల్ రియాలిటీ ద్వారా కంటెంట్
### నిరీక్షణ సమయంలో భక్తులకు జ్ఞానాన్ని పంచేలా ప్రాజెక్టు
### శ్రీ వేంకటేశ్వర మ్యూజియం ఆధునికీకరణ పనులు పూర్తి
### మీడియా సమావేశంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

**తిరుమల (సమయం న్యూస్):** శ్రీవారి దర్శనం కోసం వేచి ఉండే భక్తుల నిరీక్షణ సమయాన్ని మరింత ఆధ్యాత్మికంగా, జ్ఞానదాయకంగా మార్చేందుకు టీటీడీ ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. ఇందులో భాగంగా హీలింగ్ అండ్ డివోషనల్ సెంటర్‌ను (పిల్గ్రిమ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్) ఏర్పాటు చేసినట్లు టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి తెలిపారు. శుక్రవారం ఉదయం వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1 లోని 17 వ కంపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌ను, నూతనంగా ఆధునీకరించిన శ్రీ వేంకటేశ్వర మ్యూజియంను మీడియా ప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ 2 ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షించారు.

### క్యూలైన్లలో భక్తుల కోసం డిజిటల్ ప్రదర్శనలు..



సెప్టెంబర్ 16 న సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభమైన ఈ ప్రాజెక్టుల గురించి అదనపు ఈవో వివరించారు. క్యూ లైన్లు, కంపార్ట్‌మెంట్లలో వేచి ఉండే భక్తులకు స్వామివారి వైభవం, తిరుమల చరిత్ర, పురాణాలు, ఆలయ విశిష్టత తదితర అంశాలను 3డీ, వర్చువల్ రియాలిటీ వంటి సాంకేతికతతో అందిస్తామన్నారు. భక్తుల నిరీక్షణ సమయాన్ని జ్ఞానాన్ని పొందే సమయంగా మార్చాలన్నదే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమన్నారు. ఇప్పటికే దుర్లభ్ దర్శనం సంస్థ ఆధ్వర్యంలో వర్చువల్ రియాలిటీ కంటెంట్‌ను రూపొందించారని చెప్పారు.

### నిరంతరం కంటెంట్ అప్‌డేట్..

ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో నిరంతరం కొత్త కంటెంట్ అందుబాటులో ఉండేలా 1 ప్రత్యేక వ్యవస్థను రూపొందిస్తామన్నారు. భక్తులు దర్శనానికి వెళ్లే ముందే స్వామివారి గురించి, తిరుమల ఆలయ సంప్రదాయాలు, చరిత్ర గురించి మరింత తెలుసుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. డిజిటల్ కంటెంట్‌తో పాటు ఆలయ చరిత్ర, వారసత్వం, పురాతన కళాఖండాలను ప్రదర్శించే విధంగా 14 గ్యాలరీలతో మ్యూజియంను ఆధునీకరించినట్లు అదనపు ఈవో చెప్పారు. మ్యూజియం నిర్వహణకు సంబంధించి సీసీ కెమెరాల ఏర్పాటు, భద్రతా చర్యలతో ప్రత్యేక మాన్యువల్‌ను రూపొందిస్తున్నామని, త్వరలో దీనిని భక్తులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు.

# మహిళల భద్రతకే ఎన్డీఏ సర్కారు ప్రాధాన్యం!

- హోం మంత్రి వంగలపూడి అనిత
- అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో పర్యటన
- రూ. 4.30 కోట్లతో రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన
- ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల ప్రారంభం
- ఆటోలు, బస్సులకు అభయ స్టిక్కర్లు అంటించిన మంత్రి
- పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు



**అనకాపల్లి (సమయం న్యూస్):** రాష్ట్రంలో మహిళా భద్రతకు ఎన్డీఏ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో ఆమె శుక్రవారం పర్యటించారు. గ్రామానికి చేరుకున్న మంత్రికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజయ్యపేటలో రూ. 4.30 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి అనిత శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

### రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన..

ఆర్అండ్‌బీ నిధులు రూ. 3 కోట్లతో సారిపల్లిపాలెం‌ఉ రాజయ్యపేట రహదారి నిర్మాణానికి మంత్రి అనిత శంకుస్థాపన చేశారు. అలాగే రూ. 1.30 కోట్లతో పాయకరావుపేటఉపెంటకోట ఆర్అండ్‌బీ రహదారి నిర్మాణానికి కూడా భూమిపూజ చేశారు. అనంతరం రాజయ్యపేటలో మహాత్మా జ్యోతిబా పూలే (ఎంజేపీ) బాలికల గురుకుల పాఠశాలను ప్రారంభించారు. ఈ పాఠశాలలో రూ. 20 లక్షల సీఎస్ఆర్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. బడిలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఎంజేపీ గురుకులం ప్రారంభం కావడంతో బీసీ వర్గాల చిరకాల కల సాకారమైందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. రాజయ్యపేట, నక్కపల్లి ఆటో స్టాండ్లలో ఆటో డ్రైవర్లకు మహిళా భద్రతపై అవగాహన కల్పించారు. 'అభయ' కార్యక్రమం కింద ఆటోలు, ఆర్టీసీ బస్సులకు అభయ స్టిక్కర్లను మంత్రి అనిత స్వయంగా అంటించారు. నక్కపల్లిలో బస్సులో ప్రయాణిస్తున్న మహిళలతో ముచ్చటించి, వారి రక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 50 మంది కార్యకర్తలు మంత్రి అనిత సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కండువాలు కప్పి మంత్రి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.



# సీఈసీ రాజీనామా చేయాలి!

### ఎన్నికల సంఘంపై కాంగ్రెస్, సీజేపీ కన్నెర్ర
### జ్ఞానేష్ కుమార్‌పై విచారణ చేపట్టాలని డిమాండ్
### దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల భారీ నిరసనలు
### రాజీనామా చేయకపోతే అక్టోబర్ 2 నుంచి ఆందోళనలు
### ఈసీ వ్యవహార శైలిపై ప్రతిపక్షాల తీవ్ర అభ్యంతరం

**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్, ఇతర పార్టీలు ఉద్యమిస్తున్నాయి. ఆయన తక్షణమే పదవికి రాజీనామా చేయాలని, అరెస్టు చేసి విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ శుక్రవారం దేశవ్యాప్తంగా భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించింది. జమ్మూ కశ్మీర్, అస్సాం, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, ఉత్తర్ ప్రదేశ్, చండీగఢ్, మణిపూర్ తదితర రాష్ట్రాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు భారీ ర్యాలీలు నిర్వహించి, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయాలను ముట్టడించేందుకు యత్నించారు. మణిపూర్‌లో జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేసిన కాంగ్రెస్ శ్రేణులపై పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. డెహ్రాడూన్‌లో ఎన్నికల ఆఫీస్ ముట్టడికి యత్నించగా.. శ్రీనగర్ అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బ్యానర్లు పట్టుకుని నిరసన తెలిపారు. లఖ్‌నవూ, గువాహటి, కోల్‌కతా, చండీగఢ్‌లలోనూ ఈసీ, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు జరిగాయి.

### కాక్రోచ్ జనతా పార్టీ అల్టిమేటం..

జ్ఞానేష్ కుమార్ శనివారంలోగా రాజీనామా చేయకపోతే, మహాత్మా గాంధీ జయంతి (అక్టోబర్ 2) రోజున ముంబై వేదికగా దేశవ్యాప్త ఆందోళనలను ప్రారంభిస్తామని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) జాతీయ కన్వీనర్ అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా డ్రాఫ్ట్ జాబితా నుంచి దాదాపు 13 కోట్లకు పైగా ఓట్లను తొలగించారని ఆయన ఆరోపించారు. సీఈసీ వైదొలగకపోతే ఢిల్లీలో 'జంతర్ మంతర్ 2.0' తరహా భారీ ప్రజా నిరసనలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గడిచిన 10 నెలల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్ణయాలపై కనీసం 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రికలో కథనం వచ్చింది. దీన్ని ఆధారంగా చేసుకుని కాంగ్రెస్, ఇతర పార్టీలు నిరసనలకు దిగాయి. అయితే, ఈ ఆరోపణలను ఈసీ ఖండించింది. నిర్ణయాల ముసాయిదా సమయంలో అంతర్గత అభిప్రాయాలు, పరిపాలనా సలహాలను విభేదాలుగా చిత్రీకరించడం సరికాదని స్పష్టం చేసింది. ఇలా ఉండగా, పార్లమెంట్ రెండు సభల్లోనూ సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై ఇంపీచ్‌మెంట్ మోషన్ (తొలగింపు తీర్మానం) ప్రవేశపెట్టే అంశంపై సెప్టెంబర్ 29 న జరిగే సీడబ్ల్యూసీ భేటీలో కాంగ్రెస్ చర్చించనున్నట్లు సమాచారం.

# ఈసీపై విశ్వాసం పునరుద్ధరించాలి!

### ఎన్నికల కమిషనర్ల ఎంపికలో సీజేఐ ఉండాలి!
### కేంద్రానికి వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ విజ్ఞప్తి
### ఓటర్ల జాబితా సవరణల్లో పారదర్శకత చూపాలి
### ఎక్స్ వేదికగా మాజీ ముఖ్యమంత్రి కీలక డిమాండ్లు

**తాడేపల్లి (సమయం న్యూస్):** దేశంలో ప్రజాస్వామ్యం పరివర్తనం చెందాలంటే కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) లాంటి రాజ్యాంగబద్ధ వ్యవస్థలపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉండాలని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ఇటీవల ఎన్నికల సంఘం నిర్ణయాలు, ఓటర్ల జాబితాల నిర్వహణపై 2 మంది కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ జాతీయ మీడియాలో వచ్చిన కథనాలు ప్రజల్లో తీవ్ర అనుమానాలను రేకెత్తించాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తన అభిప్రాయాలను వెల్లడించారు.



కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజల్లో ఉన్న భయాలను తొలగించాలని వైఎస్ జగన్ డిమాండ్ చేశారు. గతంలో తాము సమర్థించిన 'కేంద్ర ఎన్నికల కమిషనర్ల నియామక చట్టం-2023'ని ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాని, ప్రతిపక్ష నేతతో పాటు భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సభ్యులుగా ఉండే 3 మంది సభ్యుల నిష్పాక్షిక కమిటీ ద్వారానే కమిషనర్లను నియమించేలా చట్టసవరణ తేవాలని స్పష్టం చేశారు. పరీక్ష రాసే విద్యార్థే స్వయంగా ఎగ్జామినర్‌ను ఎంచుకునే విధానం ఎంత నిజాయితీగా ఉన్నా అది ఆరోపణలకే తావిస్తుందని చెప్పారు. తటస్థ వ్యవస్థ ద్వారా నియామకాలు చేపడితేనే ఈసీపై ప్రజల్లో గౌరవం, విశ్వాసం పునరుద్ధరించబడతాయని పేర్కొన్నారు.

### ఓటర్ల జాబితా సవరణల్లో పారదర్శకత ఏది?

కేవలం ప్రత్యారోపణలు చేసుకోవడం కాకుండా కమిషనర్లు వ్యక్తం చేసిన అభ్యంతరాలు ఏమిటి, వాటిపై తీసుకున్న చర్యలు ఏమిటనే విషయాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని జగన్ కోరారు. ఓటర్ల పేర్ల చేర్పులు, తొలగింపుల ప్రక్రియ ఎంత పారదర్శకంగా జరిగిందో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో పారదర్శకత ఉండటమే కాకుండా, అది స్పష్టంగా కనిపించాలని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన ఎస్ఐఆర్ ప్రక్రియలో, స్థానిక సంస్థల ఎన్నికల డివిజన్ల పునర్విభజనలో ప్రభుత్వం అధికారాన్ని విపరీతంగా దుర్వినియోగం చేసిందని జగన్ ఆరోపించారు. ప్రతిపక్షంగా తాము చేసిన విజ్ఞప్తులను, వ్యక్తం చేసిన అభ్యంతరాలను పూర్తిగా పక్కన పెట్టారని విమర్శించారు. ఇలాంటి చర్యలు ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ఏ వ్యవస్థకైనా పారదర్శకత, జవాబుదారీతనమే కొలమానాలని, వాటిని కాపాడటమే ప్రాథమిక విధి అని స్పష్టం చేశారు.



# హర్మూజ్‌లో అమెరికా ‘లేజర్ వార్’!

**ఇరాన్ డ్రోన్లను ఎదుర్కొనేందుకు అత్యాధునిక ఆయుధాల మోహరింపు**

**క్రూజ్ క్షిపణులనూ అడ్డుకునే సామర్థ్యముందని అమెరికా వర్గాల వెల్లడి**

**కొన్ని వ్యవస్థల నిర్వహణకు ఎక్స్‌బాక్స్ తరహా కంట్రోలర్లు**

**లేజర్ ఆయుధాల ఉత్పత్తికి రూ.వేల కోట్ల విలువైన ఒప్పందం**

**క్షిపణులతో పోలిస్తే ఒక్కో దాడిని అడ్డుకునే ఖర్చు తక్కువేనంటున్న నిపుణులు**

**వాషింగ్టన్, సెప్టెంబర్ 25 (సమయం న్యూస్):** ఇరాన్‌తో కొనసాగుతున్న ఘర్షణల నేపథ్యంలో హర్మూజ్ జలసంధి వద్ద అమెరికా సైన్యం అత్యాధునిక లేజర్ ఆయుధాలను మోహరిస్తున్నట్లు అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి. డ్రోన్లు, ఇతర వైమానిక ముప్పులను ఎదుర్కొనేందుకు అధిక శక్తి లేజర్ వ్యవస్థలను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నాయి. కొన్ని కథనాలు డ్రోన్లతోపాటు దూసుకొచ్చే క్రూజ్ క్షిపణులను కూడా ఈ వ్యవస్థలతో కూల్చినట్లు చెబుతున్నాయి. అయితే హర్మూజ్‌లో లేజర్లతో ఎన్ని లక్ష్యాలను ధ్వంసం చేశారన్న వివరాలకు స్వతంత్ర ధ్రువీకరణ పరిమితంగానే ఉంది. సంప్రదాయ గగనతల రక్షణ వ్యవస్థల్లో శత్రు డ్రోన్ లేదా క్షిపణిని కూల్చేందుకు మరో క్షిపణిని ప్రయోగించాల్సి ఉంటుంది. లేజర్ ఆయుధాల్లో మాత్రం ప్రతి లక్ష్యానికి ప్రత్యేక భౌతిక ఇంటర్‌సెప్టర్ అవసరం ఉండదు. జనరేటర్లు లేదా బ్యాటరీల నుంచి విద్యుత్ శక్తిని తీసుకొని అత్యంత కేంద్రీకృత కాంతి కిరణాన్ని లక్ష్యంపై ప్రసరింపజేస్తాయి. ఒకే ప్రదేశంపై కొద్దిసేపు అధిక శక్తిని కేంద్రీకరించడం ద్వారా డ్రోన్ సెన్సర్లు, కీలక భాగాలను దెబ్బతీయడం లేదా దానిని పూర్తిగా నిర్వీర్యం చేయడం సాధ్యమవుతుంది.

### చేతిలో ఎక్స్‌బాక్స్ కంట్రోలర్!

ఈ అత్యాధునిక ఆయుధాల నిర్వహణలో మరో ఆసక్తికర అంశం వెలుగులోకి వచ్చింది. కొన్ని అమెరికా లేజర్ వ్యవస్థలను ఎక్స్‌బాక్స్ వీడియో గేమ్ కంట్రోలర్లను పోలిన కంట్రోలర్లతో నిర్వహిస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. అమెరికా--మెక్సికో సరిహద్దులో వినియోగిస్తున్న లేజర్ వ్యవస్థల ఆపరేటర్లు ఎక్స్‌బాక్స్ కంట్రోలర్లను ఉపయోగిస్తున్న విషయాన్ని అమెరికా సైనిక వర్గాలు వెల్లడించాయి. హర్మూజ్‌లో మోహరించిన అన్ని లేజర్ వ్యవస్థలూ ఇదే విధంగా పనిచేస్తున్నాయని మాత్రం నిర్ధారించలేం. అమెరికా సైన్యం ఇటీవల అధిక శక్తి లేజర్ ఆయుధాల ఉత్పత్తి కోసం ఏరోవైరన్‌మెంట్‌కు 464.8 మిలియన్ డాలర్ల ఒప్పందం ఇచ్చింది. ‘ఎండ్యూరింగ్ హై ఎనర్జీ లేజర్’ కార్యక్రమంలో భాగంగా లోకస్ట్ కుటుంబానికి చెందిన వ్యవస్థలను ఉత్పత్తి చేయనున్నారు. ప్రయోగ దశ నుంచి లేజర్ ఆయుధాలను పెద్దఎత్తున సైనిక వినియోగంలోకి తీసుకెళ్లే దిశగా ఇది కీలక అడుగుగా కంపెనీ పేర్కొంది.

### అమ్ముల నిల్వల భయం తగ్గుతుందా?

లేజర్ ఆయుధాల ప్రధాన ఆకర్షణ వాటి నిర్వహణ వ్యయం. ఒకసారి వ్యవస్థను ఏర్పాటు చేసిన తర్వాత తగిన విద్యుత్ శక్తి అందుబాటులో ఉన్నంతకాలం వరుసగా లక్ష్యాలను ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. ఖరీదైన క్షిపణులను తక్కువ ధర కలిగిన డ్రోన్లపై ప్రయోగించాల్సిన పరిస్థితిని ఇవి కొంతవరకు తగ్గించవచ్చని రక్షణ నిపుణులు భావిస్తున్నారు. అయితే లేజర్ ఆయుధాలు అన్ని పరిస్థితుల్లోనూ పనిచేసే ‘అద్భుత ఆయుధాలు’ కావు. వర్షం, పొగమంచు, ఆవిరి, దుమ్ము వంటి వాతావరణ పరిస్థితులు లేజర్ కిరణ సామర్థ్యాన్ని తగ్గించవచ్చు. ఒకేసారి పెద్ద సంఖ్యలో డ్రోన్లు దాడి చేసినప్పుడు కూడా పరిమితులు ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

# కీరదోసతో ‘కండోమ్ క్లాస్’

**విద్యార్థులకు ప్రత్యక్షంగా వివరించిన బయాలజీ టీచర్**

**‘అవగాహన అవసరమే’ అంటున్న కొందరు..**

**‘మరీ ఇంత వివరమా?’ అంటున్న మరికొందరు**



**పూర్ణియా, సెప్టెంబర్ 25 (సమయం న్యూస్):** విద్యార్థులకు ఓ బయాలజీ టీచర్ కండోమ్ క్లాస్ చెప్పారు. కండోమ్‌ను, కీరదోసను ఉపయోగించి.. కండోమ్ వినియోగంలో చేయకూడని పొరపాట్ల గురించి వివరించారు. సెక్స్ ఎడ్యుకేషన్‌లో భాగంగా ‘మానవ పునరుత్పత్తి వ్యవస్థ, ఆరోగ్యం’ అనే టాపిక్‌ను ఆయన బోధించారు. ఈ టాపిక్‌లో భాగంగా కండోమ్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు తెలియజేశారు. బీహార్‌లోని పూర్ణియా లోగల ఓ స్కూల్‌లో జరిగిన ఈ క్లాస్‌కు సంబంధించిన వీడియో సోషల్ మీడియా లో వైరల్‌గా మారింది. ఈ వీడియోపై నెటిజన్‌ల నుంచి మిశ్రమ స్పందన వస్తున్నది. బీహార్‌కు చెందిన చందన్ కుమార్ పండిత్ అనే బయాలజీ టీచర్ ఈ క్లాస్ చెప్పారు. ఆయన తనను తాను ఇన్‌స్టాగ్రామ్‌లో ‘ఇండియాస్ వైరల్ బయాలజీ సర్’ గా పరిచయం చేసుకుని తన క్లాస్‌లకు సంబంధించిన వీడియోలను సోషల్ మీడియాలో పెడుతుంటారు. ఇప్పుడు ఆయన పోస్ట్ చేసిన కండోమ్ క్లాస్ వీడియో కొన్ని నిమిషాల్లోనే లక్షల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. పుస్తకాల్లోని చదువుతోపాటు ఇలాంటి సున్నితమైన అంశాలపై ఉన్న అపోహలను తొలగించేందుకు ప్రాక్టికల్ అవగాహన కల్పించడం ఎంతో అవసరమని చందన్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. కండోమ్ వినియోగంతో ఉండే ప్రయోజనాలు, వినియోగంలో చేయకూడని పొరపాట్లు, జనాభా నియంత్రణలో, సుఖ వ్యాధుల నియంత్రణలో కండోమ్‌ల పాత్ర గురించి ఆ బయాలజీ టీచర్ వివరించిన విధానాన్ని పలువురు సమర్థిస్తున్నారు. కానీ మరికొందరు మాత్రం ఆ టీచర్ తీరును తప్పుపడుతున్నారు. కండోమ్ వినియోగం గురించి కీరదోసను ఉపయోగించి మరీ అంత వివరించాల్సిన అవసరం లేదని విమర్శిస్తున్నారు. ఇదిలావుంటే పునరుత్పత్తి ఆరోగ్యంపై తరగతి గదిలో బోధించే పద్ధతులపై ఈ వీడియో కొత్త చర్చకు దారితీసింది.

# సీఈసీపై క్రిమినల్ కేసు పెట్టండి!

- **జ్ఞానేశ్ కుమార్‌పై సుప్రీంకోర్టులో పిల్..**
- **ఓటర్ల జాబితా సవరణ నిర్ణయాలపై విచారణకు డిమాండ్**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25 (సమయం న్యూస్):** చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై క్రిమినల్ దర్యాప్తు, ప్రాసిక్యూషన్ చేపట్టాలని కోరుతూ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైనట్లు వార్తలు వెలువడ్డాయి. న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద ఈ పిటిషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించిన నిర్ణయాల్లో జ్ఞానేశ్ కుమార్ తన అధికార పరిధిని అతిక్రమించారన్నది పిటిషనర్ ప్రధాన ఆరోపణ. ఓటర్ల జాబితాల్లో పేర్ల చేర్పు, తొలగింపు, పునరుద్ధరణ, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ, ఎన్నికల సంఘం సాంకేతిక వ్యవస్థల నిర్వహణకు సంబంధించిన కొన్ని నిర్ణయాలు ఇతర ఎన్నికల కమిషనర్లకు తెలియకుండా లేదా వారి ఆమోదం లేకుండా జరిగాయన్న ఇటీవలి కథనాలను పిటిషన్‌లో ప్రస్తావించినట్లు సమాచారం. అయితే ఈ ఆరోపణలపై సుప్రీంకోర్టు ఇంకా ఎలాంటి నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం లేదు.



### 14 అభ్యంతరాలే కీలకంగా..

ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో ఎన్నికల సంఘం నిర్ణయాలపై లిఖితపూర్వక అభ్యంతరాలు నమోదు చేసినట్లు ‘ఇండియన్ ఎక్స్‌ప్రెస్’ పరిశోధనాత్మక కథనం వెల్లడించింది. కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు-పునరుద్ధరణ, ఫారం-6లో మార్పులు, ఓటర్ల సమాచార వ్యవస్థపై నియంత్రణ వంటి అంశాలపై ఈ అభ్యంతరాలు ఉన్నట్లు ఆ కథనం పేర్కొంది. ఈ నేపథ్యంలోనే జ్ఞానేశ్ కుమార్ తీసుకున్నట్లు ఆరోపిస్తున్న కొన్ని నిర్ణయాలు, మార్గదర్శకాలు, సాంకేతిక మార్పులను రద్దు చేయాలని పిటిషనర్ కోరినట్లు సమాచారం. ఇతర ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదం లేకుండా తీసుకున్న నిర్ణయాలు చట్టబద్ధమైనవేనా అనే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది.

### ప్రాసిక్యూషన్‌కు అనుమతించాలని విజ్ఞప్తి

1950 నాటి ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 32 కింద జ్ఞానేశ్ కుమార్‌పై చర్యలకు ఆదేశించాలని పిటిషనర్ కోరినట్లు వార్తలు పేర్కొంటున్నాయి. అయితే పిటిషన్‌లో చేసిన ఆరోపణలు ఈ దశలో పిటిషనర్ వాదనలే. వాటిపై న్యాయస్థానం విచారణ జరిపి నిర్ణయం వెలువరించాల్సి ఉంది. మరోవైపు ఎన్నికల సంఘం వర్గాలు అంతర్గత అభ్యంతరాలపై భిన్నమైన వివరణ ఇచ్చాయి. కమిషన్‌లో అధికారులు, కమిషనర్ల మధ్య నోట్లు, సూచనలు, భిన్నాభిప్రాయాలు నమోదు కావడం నిర్ణయ ప్రక్రియలో భాగమని, ప్రత్యేక సమగ్ర సవరణ సహా కీలకమైన తుది నిర్ణయాలకు ముగ్గురు కమిషనర్ల ఆమోదం ఉందని పేర్కొన్నాయి.

# పర్యాటక కేంద్రం వద్ద అమ్మాయికి వేధింపులు

- **బీహార్‌లో మరో ఘటన.. ఆరుగురిపై కేసు**
- **మందార పర్వతం వద్ద యువతిపై దాడి..**

**బంకా, సెప్టెంబర్ 25 (సమయం న్యూస్):** బీహార్‌లో యువతులపై వేధింపులకు సంబంధించిన వీడియోలు వరుసగా వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా బంకా జిల్లాలోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రమైన మందార పర్వతం వద్ద ఓ యువతిని కొందరు యువకులు వేధించినట్లు చూపుతున్న వీడియో బయటపడింది. ఘటనకు సంబంధించి బౌన్సీ పోలీసులు ఆరుగురు గుర్తుతెలియని యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వైరల్ వీడియోలో యువతితో కొందరు అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు ఆమెను చెప్పుతో కొట్టేందుకు ప్రయత్నించిన దృశ్యాలు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మరో యువకుడి చేతిలో కర్ర కూడా కనిపించినట్లు కథనాలు వెల్లడించాయి. వీడియోలో సెప్టెంబర్ 3 తేదీ కనిపిస్తున్నప్పటికీ, ఘటన ఎప్పుడు జరిగిందన్న అంశంపై భిన్న సమాచారం వెలువడుతోంది. పోలీసు వర్గాలను ఉటంకించిన తాజా కథనాల ప్రకారం ఘటన జూన్‌లో జరిగి ఉండవచ్చని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.

### వాట్సాప్‌కు వీడియో.. రంగంలోకి పోలీసులు

సెప్టెంబర్ 22న సామాజిక మాధ్యమాల విభాగం ద్వారా వీడియో పోలీసుల దృష్టికి వచ్చింది. బౌన్సీ పోలీస్ స్టేషన్ అధికారి పంకజ్ కుమార్ ఝా వాట్సాప్‌కు మధ్యాహ్నం 2.45 గంటల సమయంలో వీడియో చేరడంతో పోలీసు బృందం మందార పర్వతానికి వెళ్లి దృశ్యాల్లో కనిపించిన ప్రాంతాన్ని పరిశీలించింది. వీడియో చిత్రీకరించిన ప్రదేశం మందార పర్వతమేనని నిర్ధారించిన అనంతరం కేసు నమోదు చేశారు. ఆరుగురు గుర్తుతెలియని యువకులపై భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్లతోపాటు సమాచార సాంకేతిక చట్టం కింద కేసు నమోదు చేశారు. వీడియోలో కనిపిస్తున్న యువకులు, బాధిత యువతి వివరాలను గుర్తించేందుకు స్థానికులు, వ్యాపారులను పోలీసులు విచారిస్తున్నారు. కొందరు అనుమానితులను గుర్తించినట్లు తాజా కథనాలు పేర్కొంటున్నప్పటికీ, దర్యాప్తు కొనసాగుతోంది.



### వరుస వీడియోలతో కలకలం

ఇటీవల జమూయి, సమస్తిపూర్ జిల్లాల్లోనూ యువతులపై వేధింపులకు సంబంధించిన వీడియోలు వెలుగులోకి వచ్చాయి. జమూయి ఘటనలో పోలీసులు పలువురిని గుర్తించి అరెస్టులు చేశారు. తాజాగా బంకా ఘటనకు సంబంధించిన వీడియో బయటకు రావడంతో మహిళల భద్రత అంశం మరోసారి చర్చకు వచ్చింది.

# ‘బ్రహ్మోస్’తో పాక్‌కు నిద్రలేని రాత్రులు!

- **అమేథీ ఏకే-203 రైఫిళ్లతో మావోయిస్టులు, ఉగ్రవాదులకు వణుకు**
- **యూపీని గుండారాజ్యం నుంచి సుపరిపాలన వైపు నడిపించిన సీఎం యోగి ఆదిత్యనాథ్**
- **నోయిడాలో ‘ఉత్తర్‌ప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన’ను ప్రారంభించిన అమిత్ షా**

**గ్రేటర్ నోయిడా, సెప్టెంబర్ 25 (సమయం న్యూస్):** ఉత్తర్‌ప్రదేశ్‌లో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్‌కు ‘నిద్రలేని రాత్రులు’ మిగులుస్తున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. అమేథీలో తయారవుతున్న ఏకే--203 రైఫిళ్లు మావోయిస్టులు, ఉగ్రవాదుల్లో భయం పుట్టిస్తున్నాయని అన్నారు. గ్రేటర్ నోయిడాలో శుక్రవారం ప్రారంభమైన ఉత్తర్‌ప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి పాల్గొన్న అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను అమిత్ షా తన ప్రసంగంలో ప్రస్తావించారు. ఆ సమయంలో బ్రహ్మోస్ క్షిపణులను సమర్థంగా వినియోగించామని పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని లక్నోలో బ్రహ్మోస్ క్షిపణుల అసెంబ్లీ, ఇంటిగ్రేషన్, పరీక్షల కేంద్రం ఏర్పాటైందని, 2025 అక్టోబర్‌లో అక్కడ తయారైన తొలి బ్యాచ్‌ను పంపించినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్ రక్షణ పారిశ్రామిక కారిడార్‌లోని ఆరు కేంద్రాల్లో పెట్టుబడులు వస్తున్నాయని అమిత్ షా తెలిపారు. ఒకప్పుడు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు రక్షణ రంగం, వాహన తయారీ, వైద్య పరికరాలు సహా అనేక రంగాల్లో రాష్ట్రం ముందుకు వెళ్తోందని ఆయన పేర్కొన్నారు. ఇవి రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై అమిత్ షా చేసిన అంచనాలు.





### మాఫియా పాలన నుంచి పెట్టుబడుల కేంద్రంగా

2017కు ముందు ఉత్తర్‌ప్రదేశ్‌లో మాఫియా ప్రభావం తీవ్రంగా ఉండేదని అమిత్ షా ఆరోపించారు. యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత శాంతిభద్రతలు మెరుగుపడ్డాయని, అదే పెట్టుబడులకు అనుకూల పరిస్థితులను సృష్టించిందని పేర్కొన్నారు. 2013లో అప్పటి సమాజ్‌వాదీ పార్టీ ప్రభుత్వ హయాంలో పెట్టుబడుల సదస్సును లక్నోలో నిర్వహించలేక ఢిల్లీకి తరలించాల్సి వచ్చిందని కూడా ఆయన చెప్పారు. ఇవి రాజకీయ ప్రత్యర్థుల పాలనపై షా చేసిన విమర్శలు.

### ‘ఒక జిల్లా-ఒక ఉత్పత్తి’పై ప్రశంసలు

ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న ‘ఒక జిల్లా-ఒక ఉత్పత్తి’ కార్యక్రమాన్ని అమిత్ షా ప్రశంసించారు. స్థానిక ఉత్పత్తులకు దేశ, విదేశీ మార్కెట్లను అందించేందుకు అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా సంబంధిత నూతన వెబ్‌సైట్‌ను ఆయన ప్రారంభించారు. సెప్టెంబర్ 25 నుంచి 29 వరకు జరిగే ఈ ప్రదర్శనలో రక్షణ, వాహనాలు, ఎలక్ట్రానిక్స్, ఆహార ఉత్పత్తులు, వస్త్రాలు, ఔషధాలు, పర్యాటకం సహా అనేక రంగాలకు చెందిన సంస్థలు పాల్గొంటున్నాయి. దేశీయ తయారీని విస్తరించి భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని అమిత్ షా పేర్కొన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని ప్రభుత్వాల విధానాల వల్ల ఉత్తర్‌ప్రదేశ్‌లో పెట్టుబడుల వాతావరణం మారిందని ఆయన అన్నారు

# గాజా యుద్ధం ఆపాలి!

**వాటికన్‌లో కాథలిక్ మత గురువుల నిరసన**

**చిన్నారులకు ప్రాణహానిపై ఆవేదన.. కాల్పుల విరమణకు డిమాండ్**

**వాటికన్ సిటీ (సమయం న్యూస్):** గాజా యుద్ధానికి ముగింపు పలకాలని డిమాండ్ చేస్తూ వాటికన్‌లో కాథలిక్ మత గురువులు నిరసన చేపట్టారు. పూజారులు, సన్యాసినులు, మత ప్రతినిధులు సెయింట్ పీటర్స్ బసిలికా వరకు ర్యాలీ నిర్వహించి, గాజాలో కొనసాగుతున్న హింసను వెంటనే ఆపాలని ప్రపంచ నేతలను కోరారు. గాజాలో పౌరులు, చిన్నారులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధం వల్ల మానవతా సంక్షోభం మరింత తీవ్రమవుతోందని, తక్షణ కాల్పుల విరమణ అవసరమని స్పష్టం చేశారు. శాంతి చర్చలు ప్రారంభించి, బాధితులకు సహాయం అందేలా అంతర్జాతీయ సమాజం చర్యలు తీసుకోవాలని మత గురువులు విజ్ఞప్తి చేశారు.

# చమురు ధరలపై ఆందోళన!

**ఉద్రిక్తతల నడుమ సముద్ర మార్గాల్లో నౌకలకు అంతరాయం**

**గల్ఫ్ భద్రతపై భయం.. దౌత్యపరమైన చర్యలకు నిపుణుల సూచన**

**టెహ్రాన్ (సమయం న్యూస్):** మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో గ్లోబల్ ఆయిల్ సరఫరా, సముద్ర వాణిజ్య మార్గాల భద్రతపై అంతర్జాతీయ మార్కెట్లలో ఆందోళన కొనసాగుతోంది. గల్ఫ్ ప్రాంతంలోని కీలక సముద్ర మార్గాల్లో నౌకల రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశం ఉందన్న భయంతో చమురు ధరలు, సరఫరా వ్యవస్థపై ప్రభావం పడవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పరిస్థితులు మరింత దిగజారకుండా అంతర్జాతీయ సమాజం దౌత్యపరమైన చర్యలు చేపట్టాలని నిపుణులు సూచిస్తున్నారు.

# యుద్ధాలపై ప్రపంచ నేతల ఆందోళన!

**ఐక్యరాజ్యసమితి సాధారణ సభలో గాజా, ఉక్రెయిన్, ఇరాన్‌పై చర్చ**

**మానవతా సంక్షోభం నివారణకు శాంతి చర్చలపై పిలుపు**

**న్యూయార్క్(సమయం న్యూస్):** ఐక్యరాజ్యసమితి సాధారణ సభలో గాజా, ఉక్రెయిన్, ఇరాన్ యుద్ధ పరిస్థితులపై ప్రపంచ నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ యుద్ధాల వల్ల పౌరులు భారీగా నష్టపోతున్నారని, మానవతా సంక్షోభం మరింత తీవ్రమవుతోందని పలువురు నేతలు పేర్కొన్నారు. శాంతి చర్చలకు ప్రాధాన్యం ఇవ్వాలని, అంతర్జాతీయ చట్టాలను గౌరవిస్తూ సమస్యలకు దౌత్యపరమైన పరిష్కారం కనుగొనాలని పిలుపునిచ్చారు. గాజాలో కాల్పుల విరమణ, ఉక్రెయిన్‌లో యుద్ధ విరమణ, ఇరాన్ అంశంలో ఉద్రిక్తతలు తగ్గించే చర్యలు అవసరమని నేతలు స్పష్టం చేశారు.

# ఇరాన్‌పై పెరుగుతున్న ఒత్తిడి!

**అణు కార్యక్రమం, గల్ఫ్ భద్రతపై పశ్చిమ దేశాల ఆందోళన**

**పారదర్శకత లేకుంటే ప్రాంతీయ ఉద్రిక్తతలు తప్పవని హెచ్చరిక**

**వాషింగ్టన్ (సమయం న్యూస్):** ఇరాన్ అణు కార్యక్రమం, గల్ఫ్ ప్రాంత భద్రత అంశాలపై అమెరికా, పశ్చిమ దేశాల ఒత్తిడి కొనసాగుతోంది. ఇరాన్ అణు కార్యకలాపాలపై పారదర్శకత అవసరమని పశ్చిమ దేశాలు పేర్కొంటుండగా, గల్ఫ్ ప్రాంతంలోని సముద్ర మార్గాల భద్రతపై కూడా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ పరిణామాలతో ప్రాంతీయ ఉద్రిక్తతలు మరింత పెరిగాయని అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

# రష్యా-ఉక్రెయిన్ మళ్లీ వార్!

**తీవ్రరూపం దాల్చిన డ్రోన్లు, క్షిపణి దాడులు**

**మౌలిక వసతులు, విద్యుత్ కేంద్రాలే లక్ష్యంగా ఆస్తి నష్టం**

**కీవ్ (సమయం న్యూస్):** రష్యా, ఉక్రెయిన్ మధ్య మళ్లీ డ్రోన్లు, క్షిపణి దాడులు తీవ్రరూపం దాల్చాయి. ఈ దాడుల్లో పలు ప్రాంతాల్లో ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. ముఖ్యంగా విద్యుత్ కేంద్రాలు, మౌలిక వసతులు లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయని తెలుస్తోంది. యుద్ధ పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారడంతో అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

# ఆర్ఐఎన్ఎల్ భూముల వేలం!

**విశాఖ, విజయవాడ, హైదరాబాద్‌లలో అవగాహన సదస్సులు**

**అక్టోబర్ 12, 16 న 459 ప్లాట్ల వేలం.. ఈఎండీ రూ. 2 లక్షలు**



**విశాఖపట్నం (సమయం న్యూస్):** ఆర్ఐఎన్ఎల్‌కు చెందిన 459 భూమి ప్లాట్ల ఈ-వేలానికి ముందు ఎన్ఎల్ఎంసీ నిర్వహించిన పెట్టుబడిదారుల అవగాహన కార్యక్రమం పూర్తయింది. విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్‌లో జరిగిన సమావేశాల్లో కొనుగోలుదారులు, పెట్టుబడిదారులు పాల్గొని భూముల వివరాలు, అర్హతలు, ఈఎండీ, బిడ్డింగ్ ప్రక్రియపై సమాచారం పొందారు. మొత్తం 93,572.21 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్లాట్లు హెచ్‌బీ కాలనీ, మద్దిలపాలెం, ఆటోనగర్ గాజువాక ప్రాంతాల్లో ఉన్నాయి. ఈ-వేలం అక్టోబర్ 12 న 243 ప్లాట్లకు, అక్టోబర్ 16 న 216 ప్లాట్లకు రైల్‌టెల్ ఈ-నివిదా ప్లాట్‌ఫామ్ ద్వారా నిర్వహించనున్నారు. ప్రతి వేలానికి ఈఎండీ రూ.2 లక్షలు. వివరాలు అందుబాటులో ఉంటాయి.



# బాలు పాట అమరం.. గానం అజరామరం!

- ఒంగోలులో ఎస్పీ బాలసుబ్రమణ్యం 6 వ వర్ధంతి వేడుకలు
- చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి
- తరాలు మారినా ఆయన గొంతు సజీవమన్న వక్తలు
- 40 వేలకు పైగా పాటలతో సృష్టించిన ప్రపంచ రికార్డు
- భారీగా హాజరైన సంగీత కళాకారుల సమైక్య ప్రతినిధులు

**ఒంగోలు (సమయం న్యూస్):** గాన గంధర్వుడు, పద్మభూషణ్ డాక్టర్ ఎస్.పి. బాలసుబ్రమణ్యం 6 వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ఒంగోలు నగరంలోని స్థానిక సివిఎన్ రీడింగ్ రూమ్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రకాశం జిల్లా సంగీత కళాకారుల సమైక్య, బాలు కళా స్రవంతి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో అధ్యక్షులు ఎస్కే బాబు, నక్క సుకుమార్ నాయకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, పాల్గొన్న ప్రముఖులు బాలు సేవలను స్మరించుకున్నారు. "శంకరాభరణం" చిత్రంలోని 'శంకరా నాదశరీరాపర', "సాగరసంగమం" చిత్రంలోని 'తకిట తధిమి', "స్వాతిముత్యం" లోని 'లలిత ప్రియ కమలం', "సిరివెన్నెల" లోని 'విధాత తలపున', అలాగే 'జాబిల్లి కోసం ఆకాసమల్లే', 'నా చెలి రోజావే', "రుద్రవీణ" లోని 'తరలి రాద తనే వసంతం', "దళపతి" లోని 'సుందరి నువ్వే తొందరపడితే', "గ్యాంగ్ లీడర్" లోని 'పాలబుగ్గ', "ప్రేమికుడు" లోని 'ఊర్వశి ఊర్వశి' వంటి భక్తి, యుగళ, వేదాంత, విరహ గీతాలేవైనా తన స్వరం ద్వారా ప్రాణం పోసి, భావాలను శ్రోతల హృదయాలకు నేరుగా చేర్చడం ఒక్క ఎస్పీబీకే సాధ్యమైందని కొనియాడారు. తరాలు మారినా సంగీత ప్రపంచం ఉన్నంత కాలం ఆయన గొంతు అమరంగా ప్రతిధ్వనిస్తూనే ఉంటుందని వ్యాఖ్యానించారు.

ఇలాంటి వేలాది అమర గీతాలతో కోట్లాది మంది సంగీతాభిమానుల హృదయాల్లో ఎస్పీబీ శాశ్వత స్థానం సంపాదించుకున్నారని ప్రశంసించారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన ఆలపించిన మధురమైన పాటల రూపంలో ఎల్లప్పుడూ జీవించే ఉంటారని పేర్కొన్నారు. బాలు బహుముఖ ప్రజ్ఞను, చిత్ర పరిశ్రమకు ఆయన చేసిన అసమాన సేవలను వక్తలు గుర్తుచేసుకున్నారు. కేవలం గాయకుడిగానే కాకుండా సంగీత దర్శకుడిగా, నటుడిగా, డబ్బింగ్ కళాకారుడిగా మెప్పించిన ఆయన 5 దశాబ్దాలకు పైగా 40 వేలకు పైగా పాటలు పాడి ప్రపంచ రికార్డు సృష్టించారని తెలిపారు.

ఈ నివాళి కార్యక్రమంలో గాయనీ గాయకులు డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ, ఏల్చూరి అనంతలక్ష్మి, సిహెచ్. శేషారత్నం, యశోద, నిర్మలమ్మ, శ్రీదేవి, సంపూర్ణ కాళహస్తి, మనోహర్, పాండురంగనాథం, అంగలకుర్తి ప్రసాద్, మోహనరావు, యిర్మీయా, నాగేశ్వరరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

# మథురకు ఝాన్సీ ఎక్స్‌ప్రెస్!

- వీరాంగన లక్ష్మీబాయి ఝాన్సీ-ఆగ్రా రైలు పొడిగింపు
- రైలు నంబర్ 11901, 11902 కు రైల్వే ఆమోదం
- సాయంత్రం 4 గంటలకు ఝాన్సీలో బయలుదేరనున్న రైలు
- 217 కి.మీ నుంచి 270 కి.మీ కు పెరిగిన ప్రయాణ దూరం
- రాజా కి మండీ, బాద్ స్టేషన్లలో కొత్తగా హాల్ట్‌లు

**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** రైలు నంబర్ 11901/11902 వీరాంగన లక్ష్మీబాయి ఝాన్సీ-ఆగ్రా కాంట్ ఎక్స్‌ప్రెస్‌ను మథుర స్టేషన్ వరకు పొడిగించేందుకు భారతీయ రైల్వే ఆమోదం తెలిపింది. దీంతో ఝాన్సీ, ఆగ్రా, మథుర మధ్య వెళ్లే ప్రయాణికులకు అదనపు రైలు సౌకర్యం కలగనుంది. రూట్ పొడిగింపు అనంతరం రైలు నంబర్ 11901 వీరాంగన లక్ష్మీబాయి ఝాన్సీ నుంచి సాయంత్రం 4 గంటలకు బయలుదేరి రాత్రి 11 గంటలకు మథుర చేరుతుంది. తిరుగు ప్రయాణంలో రైలు నంబర్ 11902 మథుర నుంచి ఉదయం 5.05 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12.50 గంటలకు ఝాన్సీకి చేరుకుంటుంది. తాజా నిర్ణయంతో ఈ రైలు ప్రయాణ దూరం 217 కి.మీ నుంచి 270 కి.మీ కు పెరుగుతుంది. పొడిగించిన కొత్త మార్గంలో రాజా కి మండీ, రున్‌కుటా, దీన్ దయాళ్ ధామ్, బాద్ స్టేషన్లలో ఈ రైలుకు హాల్ట్‌లు కల్పించనున్నారు. రైల్వే తీసుకున్న ఈ నిర్ణయంతో ఝాన్సీ, ఆగ్రా, మథుర ప్రాంతాల మధ్య ప్రయాణికుల కనెక్టివిటీ మరింతగా బలోపేతం కానుంది.




# డీఎస్సీ అక్రమాలను కప్పిపుచ్చుతారా?

- కేసుల ముసుగులో ప్రతిపక్షాల గొంతు నొక్కే యత్నం
- శాంతియుత నిరసనలకు ఐదు రోజుల ముందే పోలీసులకు సమాచారం
- మఫ్టీలో వచ్చి అర్ధరాత్రి అరెస్టులు, కుటుంబాలకు బెదిరింపులు
- అక్రమ కేసులకు భయపడబోమన్న మాజీ మంత్రులు
- కాకుమాను రాజశేఖర్ మృతికి పోలీసుల తోపులాటే కారణమని ఆరోపణ



**తాడేపల్లి (సమయం న్యూస్):** డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో చోటుచేసుకున్న అక్రమాలను ఆధారాలతో సహా ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతల గొంతు నొక్కేందుకు ప్రభుత్వం పోలీసు కేసులను అడ్డుపెట్టుకుంటోందని ఆ పార్టీ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల నేతలు మండిపడ్డారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ నేతలతో స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి సమావేశమయ్యారు. నేతలపై అక్రమ కేసులు, అరెస్టుల వ్యవహారంపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించారు. సమావేశం అనంతరం ఉమ్మడి జిల్లాల నేతలు మీడియాతో మాట్లాడుతూ.. డీఎస్సీ అక్రమాలను కప్పిపుచ్చేందుకే ఈ తరహా వేధింపులకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం (సెప్టెంబర్ 26) విజయవాడ పోలీస్ కమిషనర్‌ను కలిసి ఆధారాలతో ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. తమపై సెక్షన్ 307 కింద హత్యాయత్నంతో పాటు, ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ కేసులు ఎందుకు పెట్టారని మాజీ మంత్రి అంబటి రాంబాబు నిలదీశారు. తాము ఎవరినైనా కులం పేరుతో దూషించామా? చంపేందుకు ప్రయత్నించామా? ఆయుధం, కర్ర, కనీసం రక్తపు చుక్క లేదు.. అయినా సెక్షన్ 307 ఎలా పెడతారని ప్రశ్నించారు. అర్ధరాత్రి మఫ్టీలో వచ్చి అరెస్టు చేయడం ప్రజాస్వామ్య పద్ధతి కాదన్నారు.

**భయపడేది లేదు : వెల్లంపల్లి శ్రీనివాస్**

స్థానిక సంస్థల ఎన్నికల్లో తాము బయట ఉండకూడదనే ఉద్దేశంతోనే ఈ కేసులు పెడుతున్నారని మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ విమర్శించారు. టీడీపీకి చెందిన వారిపై కేసులు లేకుండా, వైఎస్సార్‌సీపీ వారిపైనే సెక్షన్లు ఎలా వర్తిస్తాయని ప్రశ్నించారు. లీగల్ టీమ్ ద్వారా తప్పుడు కేసులపై న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.


**ప్రతిపక్షం గొంతు నొక్కే యత్నం : లేళ్ల అప్పిరెడ్డి**

డీఎస్సీ అక్రమాలపై వైఎస్సార్‌సీపీ ఆధారాలతో ప్రశ్నిస్తుంటే.. సమాధానం చెప్పకుండా పోలీసులను అడ్డం పెట్టుకుని నాయకులు, కార్యకర్తలను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఆక్షేపించారు. టీడీపీకి అనుకూలంగా ఉన్నవారికి టెంట్లు, కుర్చీలు, మైకులు ఏర్పాటు చేసి నిరసనకు అవకాశం కల్పించారని, తమపై మాత్రం కేసులు పెట్టారని మండిపడ్డారు. ప్రతిపక్ష గొంతు నొక్కే ప్రయత్నం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని హితవు పలికారు.

**పోలీసుల తోపులాట వల్లే రాజశేఖర్ మృతి : టీజేఆర్ సుధాకర్ బాబు**

డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో 382 ఉద్యోగాల్లో భారీగా నకిలీ సర్టిఫికెట్లతో కొలువులు పొందినట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్ బాబు అన్నారు. ఆ వివరాలను అధికారులకు అందించేందుకే సెప్టెంబర్ 21 న శాప్ కార్యాలయానికి వచ్చామని తెలిపారు. తాము యుద్ధానికి, ఘర్షణకు రాలేదన్నారు. పోలీసుల తోపులాటలోనే వైఎస్సార్‌సీపీ కార్యకర్త కాకుమాను రాజశేఖర్ తీవ్రంగా గాయపడి మృతి చెందారని, ఈ ఘటనకు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో మాజీ మంత్రులు పేర్ని నాని, జోగి రమేష్, ఎమ్మెల్సీలు మొండితోక అరుణ్ కుమార్, మురుగుడు హనుమంతరావు, యేసురత్నం, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, దేవినేని అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



# మానవతావాది చిలకమర్తి లక్ష్మీనరసింహం

## నేడు సంఘ సంస్కర్త చిలకమర్తి జయంతి

పుస్తకంలో చదివిన మాట కన్నా.. కళ్లముందు కదిలే పాత్ర బలంగా మనసులో నిలిచిపోతుంది. వినిపించే సంభాషణ ఆలోచింపజేస్తుంది. నాటకం నవ్విస్తూనే ప్రశ్నిస్తుంది. ఈ ప్రజానాడిని నూటికి నూరుపాళ్లు పట్టుకున్న రచయిత చిలకమర్తి లక్ష్మీనరసింహం. సామెతలు, నుడికారాలు, లోకోక్తులు, జాతీయాలను తన రచనల్లో సహజంగా మేళవించి సామాన్యుడికీ సాహిత్యాన్ని చేరువ చేసిన మహా రచయిత. కలాన్ని కేవలం సాహిత్య సృష్టికే పరిమితం చేయకుండా సమాజంలోని అసమానతలను ప్రశ్నించేందుకు ఉపయోగించిన మానవతావాది. తెలుగు సాహిత్యం, నాటక రంగం, పాత్రికేయం, విద్య, సంఘ సంస్కరణ.. ఇలా అడుగుపెట్టిన ప్రతి రంగంలో తనదైన ముద్ర వేసిన చిలకమర్తి జయంతి నేడు. చిలకమర్తి లక్ష్మీనరసింహం 1867 సెప్టెంబర్ 26న పశ్చిమ గోదావరి ప్రాంతంలోని ఖండవల్లి గ్రామంలో వెంకయ్య, రత్నమ్మ దంపతులకు జన్మించారు. వీరవాసరం, నరసాపురం ప్రాంతాల్లో ప్రాథమిక విద్యాభ్యాసం సాగింది. అనంతరం రాజమండ్రిలో విద్యను కొనసాగించారు. ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించిన ఆయన ఆర్య పాఠశాల, ఇన్నీసుపేట పాఠశాల, మున్సిపల్ హైస్కూలులో విద్యాబోధన చేశారు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే ఆయనలోని రచయిత మరింత పదునెక్కాడు. విద్యార్థి దశ నుంచే పద్యరచనపై ఆసక్తి పెంచుకున్న చిలకమర్తి.. ఆ తర్వాత తెలుగు సాహిత్య చరిత్రలో తనకంటూ ప్రత్యేక అధ్యాయాన్ని సృష్టించారు. 'కీచక వధ'లితో నాటక రచనకు శ్రీకారం చుట్టిన చిలకమర్తి ఆ తర్వాత ద్రౌపదీ పరిణయం, గయోపాఖ్యానం, శ్రీరామ జననం, సీతా కల్యాణం, పారిజాతాపహరణం తదితర రచనలు చేశారు. వీటన్నింటిలో 'గయోపాఖ్యానం' ఆయనకు అసాధారణ ప్రజాదరణ తీసుకొచ్చింది. తెలుగు నాటక సమాజాలు ఉన్న అనేక ప్రాంతాల్లో గయోపాఖ్యానం ప్రదర్శితమైంది. అందులోని పద్యాలు తరతరాల తెలుగు ప్రేక్షకుల నోట పలికాయి. ఈ నాటకంలో టంగుటూరి ప్రకాశం పంతులు అర్జునుడి పాత్ర పోషించడం మరో విశేషం. 1940ల నాటికే గయోపాఖ్యానం లక్షకు పైగా ప్రతులు అమ్ముడైనట్లు సాహిత్య చరిత్రలో నమోదైంది. ఆ కాలంలో ఒక తెలుగు నాటక రచనకు ఆ స్థాయి ఆదరణ దక్కడం విశేషం. చిలకమర్తి కలం నాటకాలకే పరిమితం కాలేదు. రామచంద్ర విజయం, హేమలత, అహల్యాబాయి వంటి నవలలతో పాటు అనేక గద్య, పద్య రచనలు చేశారు. ముఖ్యంగా 'గణపతి' ఆయన హాస్య రచనా ప్రతిభకు చిరునామాగా నిలిచింది. నవ్వు వెనుక సామాజిక వాస్తవాలను చూపించడం, పాత్రల ద్వారా సమాజంలోని వైరుధ్యాలను బయటపెట్టడం ఆయన రచనా ప్రత్యేకత. సామాన్య ప్రజల మాటతీరు, జీవన విధానం, వారి కష్టసుఖాలు ఆయన రచనల్లో కనిపిస్తాయి. అందుకే చిలకమర్తి సాహిత్యం పండితులకే పరిమితం కాకుండా ప్రజల్లోకి వెళ్లింది. పాత్రికేయ రంగంలోనూ చిలకమర్తి తనదైన పాత్ర పోషించారు. 'సరస్వతి' పత్రిక సంపాదకుడిగా పనిచేశారు. అనంతరం ముద్రణ రంగంలోకి అడుగుపెట్టి సొంతంగా అచ్చు యంత్రాన్ని నెలకొల్పారు. 'మనోరమ', 'దేశమాత' వంటి పత్రికల ద్వారా సాహిత్య, సామాజిక, జాతీయ భావాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. బ్రిటిష్ పాలన సాగుతున్న రోజుల్లో జాతీయ భావాలను తన రచనల ద్వారా వ్యక్తం చేశారు. సాహిత్యం వినోదం కోసం మాత్రమే కాదని, సమాజాన్ని మేల్కొలిపే శక్తి దానికి ఉందని తన రచనా జీవితంతో నిరూపించారు. చిలకమర్తిని కేవలం రచయితగా చూస్తే ఆయన జీవితంలో సగభాగాన్నే చూసినట్లవుతుంది. ఆయనలో గొప్ప సంఘ సంస్కర్త కూడా ఉన్నారు. సామాజికంగా వెనుకబడిన, అణగారిన వర్గాల పిల్లలకు విద్య అందించాలన్న లక్ష్యంతో రామమోహన పాఠశాలను ఏర్పాటు చేశారు. తన రచనల ద్వారా వచ్చిన ఆదాయాన్ని సైతం పాఠశాల నిర్వహణకు వెచ్చించారు. కుల వివక్ష బలంగా వేళ్లూనుకున్న కాలంలో అణగారిన వర్గాల పిల్లల విద్య కోసం ప్రత్యేకంగా ముందుకు రావడం ఆయన సంస్కరణ దృక్పథానికి నిదర్శనం. విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమని ఆయన విశ్వసించారు. కందుకూరి వీరేశలింగం ప్రభావం చిలకమర్తిపై బలంగా ఉండేది. బ్రహ్మసమాజం, హితకారిణీ సమాజం వంటి సంస్కరణ కార్యక్రమాల్లో భాగస్వామిగా నిలిచారు. మూఢాచారాలు, సామాజిక అసమానతలపై తన రచనల ద్వారా ప్రశ్నించారు. సమాజంలో మార్పు రావాలంటే విద్య, చైతన్యం అవసరమనే భావనను జీవితాంతం ఆచరణలో చూపించారు. చిలకమర్తి రచించిన స్వీయచరిత్ర తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది. బాల్యం, విద్యాభ్యాసం, ఉద్యోగ జీవితం, రచనా ప్రస్థానం, నాటక సమాజాలు, కుటుంబ పరిస్థితులు, పాఠశాలల ఏర్పాటు, పత్రికా సంపాదకత్వం, జాతీయోద్యమ పరిణామాలు.. తన జీవితంలో ఎదురైన అనేక అంశాలను అందులో వివరించారు. అద్భుతమైన జ్ఞాపకశక్తితో తన కాలంలోని వ్యక్తులు, సంఘటనలను నమోదు చేశారు. వ్యక్తుల గురించి రాసేటప్పుడు రాగద్వేషాలకు అతీతంగా వ్యవహరించేందుకు ప్రయత్నించడం ఆయన స్వీయచరిత్ర ప్రత్యేకతగా సాహితీవేత్తలు పేర్కొంటారు. జీవితంలో చూపు సమస్యలు ఎదురైనా చిలకమర్తి తన సాహిత్య, సామాజిక ప్రయాణాన్ని ఆపలేదు. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూనే రచనలు కొనసాగించారు. నాటకకర్తగా, హాస్య రచయితగా, నవలా రచయితగా, పాత్రికేయుడిగా, విద్యావేత్తగా, సంఘ సంస్కర్తగా తెలుగు సమాజానికి విశేష సేవలందించారు. ఆయన సాహిత్య సేవలకు గుర్తింపుగా 1943లో ఆంధ్ర విశ్వవిద్యాలయం 'కళాప్రపూర్ణ' బిరుదుతో సత్కరించింది. 1946 జూన్ 17న చిలకమర్తి లక్ష్మీనరసింహం కన్నుమూశారు. గురజాడ 'కన్యాశుల్కం', వేదం వెంకటరాయశాస్త్రి 'ప్రతాపరుద్రీయం', శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి 'బొబ్బిలి యుద్ధం' సరసన చిలకమర్తి 'గయోపాఖ్యానం' తెలుగు నాటక రంగంలో చిరస్థాయిగా నిలిచింది. 'గణపతి' వంటి రచనలు నేటికీ పాఠకులను అలరిస్తూనే ఉన్నాయి. కలం ఆయనకు కేవలం రచనా సాధనం కాదు.. సామాజిక మార్పునకు ఆయుధం. విద్య ఆయన దృష్టిలో ఉద్యోగానికి మార్గం మాత్రమే కాదు.. మనిషిని బానిసత్వం నుంచి బయటకు తీసుకొచ్చే వెలుగు. అందుకే చిలకమర్తి లక్ష్మీనరసింహం ఒక రచయితగా మాత్రమే కాదు.. అక్షరాలతో సమాజాన్ని సంస్కరించాలని తపించిన మానవతావాదిగా తెలుగు ప్రజల జ్ఞాపకాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# గర్భ నిరోధకతపై అవగాహన

## ప్రాచీన సంప్రదాయం నుంచి ఆధునిక విధానాలు

### నేడు ప్రపంచ గర్భనిరోధక దినోత్సవం




ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 26న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే ప్రపంచ గర్భనిరోధక దినోత్సవం మహిళా ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, యువత శక్తి, సమాజ అభివృద్ధి గురించి అవగాహన పెంపొందించే ప్రధాన దినంగా గుర్తించబడింది. ఈ దినోత్సవం ప్రధానంగా గర్భనిరోధక పద్ధతుల సురక్షిత, సమర్థవంతమైన వినియోగం, వ్యక్తిగత మరియు జంట హక్కులపై దృష్టి సారించడం కోసం ఏర్పాటు చేయబడింది. గర్భనిరోధక పద్ధతుల అవగాహన కేవలం వ్యక్తిగత సమస్యలకు పరిమితం కాకుండా సమాజం, దేశ స్థిరత్వానికి కూడా కీలకంగా ఉంది. భారతదేశంలో కుటుంబ నియంత్రణకు సంబంధించిన అవగాహన ప్రాచీన కాలం నుంచే ఉంది. ఆయుర్వేద గ్రంథాలలో ఫర్టిలిటీ నియంత్రణ, మూలికల ఆధారిత గర్భనిరోధక పద్ధతులు వివరంగా వర్ణించబడ్డాయి. మహాభారత, రామాయణ వంటి ప్రాచీన కాలంలో కూడా కుటుంబ పరిమాణాన్ని నియంత్రించడంలో వ్యక్తిగత బాధ్యత, సమాజ పరిమితుల ప్రాధాన్యం ప్రస్తావించబడింది. 20వ శతాబ్దంలో, జనాభా విస్తరణ, మహిళా ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం ప్రధాన సమస్యలుగా మారడంతో, అంతర్జాతీయంగా గర్భనిరోధక అవగాహనపై ప్రత్యేక దృష్టి సారించడం ప్రారంభమైంది. 2007లో ఇంటర్నేషనల్ ప్లాన్డ్ పారెంథూడ్ ఫెడరేడరేషన్ (ఐపీపీఎఫ్ ) సెప్టెంబర్ 26ని ప్రపంచ గర్భ నిరోధక దినోత్సవంగా ప్రకటించింది. గర్భనిరోధక పద్ధతులు మూడు ప్రధాన వర్గాల్లో విభజించవచ్చు. సంక్లిష్టత లేని పద్ధతులలో కండమ్, డయాఫ్రాగమ్, సర్వెంటైన్ ఉన్నాయి, ఇవి లైంగిక వ్యాధుల నుండి రక్షణ ఇచ్చే విధంగా, గర్భధారణను కూడా నివారిస్తాయి. హార్మోనల్ పద్ధతులలో గర్భ నిరోధక పిల్‌లు, ఇంజెక్షన్‌లు, ఇంప్లాంట్‌లు ముఖ్యమైనవి, ఇవి హార్మోన్ల మార్పుల ద్వారా గర్భసాధ్యాన్ని నిరోధిస్తాయి. ప్రకృతి ఆధారిత పద్ధతులలో ఫర్టిలిటీ అవేర్‌నెస్, చక్ర గణన, శరీర ఉష్ణోగ్రత పద్ధతులు ఉన్నాయి, వీటిని జాగ్రత్తగా ఉపయోగిస్తే గర్భనిరోధకత సాధ్యమవుతుంది. గణాంకాల ప్రకారం, ప్రపంచ వ్యాప్తంగా స్త్రీలలో సుమారు 60 శాతం మంది సురక్షిత గర్భనిరోధక పద్ధతులను ఉపయోగిస్తారు, అయితే అభివృద్ధి చెందని కొన్ని దేశాల్లో ఈ సంఖ్య 30 శాతం కన్నా తక్కువ. భారత్‌లో స్త్రీలలో సుమారు 58 శాతం మంది మాత్రమే సురక్షిత గర్భనిరోధక పద్ధతులను ఉపయోగిస్తున్నారు. 2015లో ఇది 50 శాతం మాత్రమే ఉండటం, క్రమంగా మార్పు జరుగుతున్నదని సూచిస్తుంది. గర్భనిరోధక పద్ధతుల వినియోగం మహిళా ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, ఆర్థిక స్వావలంబన, యువత ప్రగతికి కీలకంగా మారింది. అసురక్షిత గర్భ నిరోధకత, అనూహ్య గర్భ స్రావాలు, గర్భపాతం వల్ల ఏర్పడే ఆరోగ్య సమస్యలు తగ్గుతాయి. పిల్లల సంఖ్యను నియంత్రించడం ద్వారా ప్రతి పిల్లకు సరైన పోషణ, విద్య, వైద్య సౌకర్యం లభిస్తుంది. అలాగే, కుటుంబ వ్యయం, వైద్య ఖర్చులు సమర్థవంతంగా విభజించవచ్చు. సురక్షిత గర్భనిరోధక పద్ధతులు యువతకు చదువు, కెరీర్ అవకాశాలను తగ్గకుండా పెంపొందిస్తాయి. భారతదేశంలో కుటుంబ సంక్షేమ, గర్భనిరోధక అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా కొనసాగు తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత కండమ్, ఇంప్లాంట్, శిక్షణా వర్క్‌షాప్‌లు అందించడం జరుగుతుంది. ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్, వైద్య పాఠశాలలు ద్వారా మహిళలు, యువతకు అవగాహన కల్పించ బడుతుంది. అయినప్పటికీ, గ్రామీణ ప్రాంతాల లోపలి విద్య, సాంప్రదాయ పరిమితుల కారణంగా అవగాహన ఇంకా తక్కువగా ఉంది. ఈ కారణంగా, తల్లితనం రేటు, బాలికల ఆరోగ్యం, మహిళల ఆర్థిక స్వావలంబనపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ప్రపంచ గర్భనిరోధక దినోత్సవం సందర్భంగా వర్క్‌షాప్‌లు, సదస్సులు, సామాజిక మీడియా ప్రచారాలు, పబ్లిక్ క్యాంపెయిన్‌లు జరుగుతాయి. యువత, మహిళలు, కుటుంబాలు, వృద్ధులు, సర్వసాధారణ ప్రజలకు సులభంగా, స్పష్టంగా సమాచారం అందించడానికి కృషి జరుగుతుంది. ఈ దినోత్సవం ద్వారా ప్రతి వ్యక్తికి అందించే ముఖ్య సందేశం: "ప్రతి వ్యక్తి, ప్రతి జంట గర్భనిరోధక పద్ధతుల గురించి అవగాహన కలిగి, వాటిని సురక్షితంగా ఉపయోగించడం అనేది వారి హక్కు. ఇది మహిళా శక్తి, కుటుంబ సంక్షేమం, సమాజ అభివృద్ధికి మూలాధారం." భారతీయ సాంప్రదాయంలో స్త్రీలకు, కుటుంబానికి, సమాజానికి ఉన్న హక్కులు, బాధ్యతల ఆధారంగా, సురక్షిత గర్భ నిరోధకత, మహిళా ఆరోగ్యం, పిల్లల పౌష్టికాహారం వంటి అంశాలు ప్రాచీన కాలం నుంచే గుర్తించబడ్డాయి. ఈ దినోత్సవం ఆధునిక సమాజంలో ఆ వారసత్వాన్ని కొనసాగిస్తూ, ప్రతి మహిళ, కుటుంబం, సమాజం కోసం అవగాహన, సంకల్పం పెంపొందిస్తుంది. ప్రపంచ గర్భనిరోధక దినోత్సవం కేవలం గుర్తింపు మాత్రమే కాదు. సురక్షిత, సమర్థవంతమైన, సులభంగా అందుబాటులో ఉండే గర్భనిరోధక పద్ధతులు సమాజానికి ప్రగతి, ఆరోగ్యం, మహిళా శక్తి, ఆర్థిక స్వావలంబన తీసుకొస్తాయి. ప్రతి వ్యక్తి ఈ హక్కును తెలుసుకొని, సురక్షితంగా ఉపయోగించాలి. తద్వారా భారతీయ సమాజం మరియు ప్రపంచ సమాజం ఆరోగ్యకరంగా, శక్తివంతంగా మారుతుంది.




రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494


# ప్రకృతి రక్షణే ప్రజారోగ్యం

### నేడు ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం

**మానవ ఆరోగ్యం ప్రకృతితో ఎంతటి విడదీయరాని అనుబంధాన్ని కలిగి ఉందో గుర్తుచేస్తూ ప్రతి ఏటా సెప్టెంబర్ 26న ప్రపంచవ్యాప్తంగా 'ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం' నిర్వహిస్తున్నారు. 1991లో అంతర్జాతీయ పర్యావరణ ఆరోగ్య సమాఖ్య ప్రారంభించిన ఈ దినోత్సవం పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, నిపుణుల కృషిని గుర్తించడం మరియు రాబోయే తరాల భవిష్యత్తు సుస్థిరత కోసం ఐక్యంగా పనిచేయాలని పిలుపునిస్తోంది. "మాతా భూమిః పుత్రోహం పృథివ్యాః" అంటూ వేద కాలం నుంచే భూమిని తల్లిగా, వృక్షాలను "వృక్షో రక్షతి రక్షితః" అని పూజించే గొప్ప సంస్కృతి మనది అని ప్రముఖ వ్యాసకర్త, సీనియర్ జర్నలిస్ట్ రామ కిష్టయ్య సంగన భట్ల పేర్కొన్నారు.**




అయితే ఆధునిక యుగంలో పారిశ్రామిక వ్యర్థాలు, వాహన కాలుష్యం, రసాయనాలు మరియు ప్లాస్టిక్ వినియోగం వల్ల మనిషికి, ప్రకృతికి మధ్య ఉన్న బంధం క్షీణిస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఏటా గాలి కాలుష్యం వల్ల దాదాపు 70 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి లెక్కల ప్రకారం దేశంలోని 131 ప్రధాన నగరాల్లో 90 నగరాలు గాలి నాణ్యత ప్రమాణాలను కోల్పోయాయి. మరోవైపు జాతీయ నది పరిరక్షణ ప్రణాళిక ప్రకారం ప్రతిరోజూ గంగానదిలోనే 3 వేల మిలియన్ లీటర్ల మలిన జలాలు చేరుతుండటం జల కాలుష్య తీవ్రతకు అద్దం పడుతోంది. 1901 నుండి 2020 మధ్య దేశ సగటు ఉష్ణోగ్రత 0.7 డిగ్రీల సెల్సియస్ పెరగడంతో వరదలు, కరువులు మరియు పంటల నష్టం వంటి తీవ్ర పరిణామాలు సంభవిస్తున్నాయి. కారణాలు ఏవైనప్పటికీ ఉత్తరాఖండ్ చిప్కో ఉద్యమం, నర్మదా బచావో ఆందోళన వంటి చారిత్రక ఘట్టాలు పర్యావరణ రక్షణ ప్రాధాన్యతను నిరూపించాయి. ఈ క్రమంలోనే "శుభ్రమైన గాలి - ఆరోగ్యవంతమైన జీవితం" అనే ప్రాధాన్య అంశంతో ప్రపంచ దేశాలు పర్యావరణ మార్పులపై పోరాడుతున్నాయి. అందరికీ శుభ్రమైన గాలి లభిస్తే మానవుని సగటు జీవితకాలం 2.2 సంవత్సరాలు పెరుగుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.





ప్రకృతి రక్షణే ప్రజారోగ్యానికి మూలస్తంభమని గ్రహించి, ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా మొక్కలు నాటడం, నీటిని ఆదా చేయడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం అలవాటు చేసుకోవాలి. ప్రభుత్వాలు కూడా పరిశ్రమలపై కఠిన నిబంధనలు అమలు చేస్తూ పునరుత్పాదక ఇంధన రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను (ుణ+ం) సాధిస్తూ, పర్యావరణాన్ని రక్షించుకోవడం ద్వారానే రాబోయే తరాలకు ఆరోగ్యవంతమైన, సురక్షితమైన ప్రపంచాన్ని అందించగలమని పర్యావరణ నిపుణులు పిలుపునిస్తున్నారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ఏంది సామీ ఆ ఆట..

## ఆఫ్ఘాన్‌ను చుట్టేసిన నేపాల్!

ఆసియా క్రీడల్లో పసికూన సంచలనం..
ఐదు వికెట్లతో ఆఫ్ఘనిస్తాన్ చిత్తు




- కుశాల్ భుర్తేల్ నాలుగు వికెట్ల మాయ.. రాజ్‌బన్షికి మూడు
- 102 పరుగులకే ఆఫ్ఘాన్‌ను కట్టడి చేసిన నేపాల్ బౌలర్లు
- జోరా 34.. రోహిత్ పౌడెల్ అజేయంగా 33.. 17.2 ఓవర్లలో లక్ష్యం ఛేదింపు
- గ్రూప్ అగ్రస్థానంపై నేపాల్ కన్ను.. రేపు జపాన్‌తో కీలక పోరు

**నిషిన్, సెప్టెంబర్ 25 (సమయం న్యూస్):** ఏంది సామీ ఆ ఆట..! ఆసియా క్రీడల క్రికెట్‌లో నేపాల్ అదరగొట్టింది. బలమైన ఆఫ్ఘనిస్తాన్‌ను బంతితో బంధించి.. బ్యాటుతో పని పట్టింది. శుక్రవారం జపాన్‌లోని నిషిన్ కొరోగి స్పోర్ట్స్ పార్క్‌లో జరిగిన గ్రూప్-ఏ 4 మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్తాన్‌పై 5 వికెట్ల తేడాతో నేపాల్ సంచలన విజయం సాధించింది. ఆఫ్ఘనిస్తాన్ నిర్దేశించిన 103 పరుగుల లక్ష్యాన్ని నేపాల్ 17.2 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి ఛేదించింది.

### ముందే చుట్టేశారు!

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆఫ్ఘనిస్తాన్‌కు నేపాల్ బౌలర్లు చుక్కలు చూపించారు. ఆరంభం నుంచే వికెట్లు తీస్తూ పరుగులకు కళ్లెం వేశారు. హసన్ ఐసాఖిల్ డకౌట్ కాగా, మహ్మద్ అక్రమ్ రెండు పరుగులకే వెనుదిరిగాడు. కరీమ్ జనత్ తొమ్మిది పరుగులు చేశాడు. ఫైసల్ షినోజాదా, నజీబుల్లా జాద్రాన్ చెరో 30 పరుగులతో ఆదుకునే ప్రయత్నం చేసినా భారీ స్కోరు సాధ్యం కాలేదు. నిర్ణీత 20 ఓవర్లలో ఆఫ్ఘనిస్తాన్ ఏడు వికెట్లకు 102 పరుగులకే పరిమితమైంది.

### భుర్తేల్ బంతి పట్టాడా.. వికెట్ పడాల్సిందే!

నేపాల్ బౌలింగ్‌లో కుశాల్ భుర్తేల్ ఆఫ్ఘాన్ బ్యాటింగ్ వెన్ను విరిచాడు. నాలుగు ఓవర్లలో 21 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. లలిత్ రాజ్‌బన్షి మరో మూడు వికెట్లు తీసి ప్రత్యర్థిని కోలుకోనివ్వలేదు. ఆఫ్ఘనిస్తాన్ కోల్పోయిన ఏడు వికెట్లనూ ఈ ఇద్దరే పంచుకోవడం విశేషం.

### ఆరంభంలో షాక్.. ఆ తర్వాత జోరా జోరు

103 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నేపాల్‌కూ ఆరంభంలో ఎదురుదెబ్బలు తగిలాయి. కుశాల్ భుర్తేల్ పరుగులేమీ చేయకుండానే ఔటవగా, ఆసిఫ్ షేక్ రెండు పరుగులకే వెనుదిరిగాడు. కానీ సందీప్ జోరా 34 పరుగులు, రోహిత్ పౌడెల్ అజేయంగా 33, దీపేంద్ర సింగ్ ఐరీ 15 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చారు. 17.2 ఓవర్లలో 103/5తో నేపాల్ మ్యాచ్‌ను ముగించింది.

### ఆఫ్ఘాన్‌కు రెండో స్థానం ఖాయం కాదు

అయితే గ్రూప్ సమీకరణాల విషయంలో మీ ముసాయిదాలో చిన్న సవరణ అవసరం. ఆఫ్ఘనిస్తాన్ గురువారం జపాన్‌ను 48 పరుగులతో ఓడించింది. నేపాల్ శనివారం జపాన్‌తో తలపడనుంది. గ్రూప్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరతాయి. అందువల్ల నేపాల్-జపాన్ మ్యాచ్ పూర్తయ్యాకే గ్రూప్-ఏ తుది స్థానాలపై పూర్తి స్పష్టత వస్తుంది; ప్రస్తుతం ఆఫ్ఘనిస్తాన్ రెండో స్థానంతో క్వార్టర్స్‌కు చేరడం ఖాయమని చెప్పడం తొందరపాటు.




# షూటింగ్‌లో భారత్‌కు స్వర్ణం, రజతం

**నగోయా, సెప్టెంబరు 25 (సమయం న్యూస్):** జపాన్‌లో జరుగుతున్న ఆసియా క్రీడలు--2026లో భారత షూటర్లు అదరగొడుతున్నారు. శుక్రవారం 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో సురుచి ఇందర్ సింగ్, కమల్‌జీత్ జోడీ భారత్‌కు స్వర్ణ పతకాన్ని అందించింది. ఫైనల్లో భారత జోడీ 484.6 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. ఈ క్రమంలో ఆసియా రికార్డును కూడా నెలకొల్పింది.

ఆరంభం నుంచే సురుచి, కమల్‌జీత్ జోడీ ఆధిపత్యం ప్రదర్శించింది. ఫైనల్‌లో ఒత్తిడి పెరిగినప్పటికీ తమ ప్రదర్శనలో స్థిరత్వాన్ని కొనసాగిస్తూ చివరి వరకు ఆధిక్యాన్ని నిలబెట్టుకుంది. దక్షిణ కొరియా జోడీ 478.0 పాయింట్లతో రజతం సాధించగా.. ఇరాన్ 415.8 పాయింట్లతో కాంస్య పతకాన్ని దక్కించుకుంది. భారత జోడీ 6.6 పాయింట్ల ఆధిక్యంతో స్వర్ణాన్ని సొంతం చేసుకుంది.

### 50 మీటర్ల రైఫిల్‌లో రజతం

ఇదే రోజు షూటింగ్‌లో భారత్‌కు మరో పతకం కూడా లభించింది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ టీమ్ విభాగంలో ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, నిరాజ్ కుమార్, రుద్రాంక్ష్ పాటిల్ రజత పతకాన్ని సాధించారు. భారత బృందం 1762-94ఎక్స్ స్కోరుతో రెండో స్థానంలో నిలిచింది. చైనా 1766-95ఎక్స్ స్కోరుతో స్వర్ణం సాధించగా.. దక్షిణ కొరియా 1751-87ఎక్స్ స్కోరుతో కాంస్యం గెలుచుకుంది. భారత షూటర్ల ప్రదర్శనతో ఆసియా క్రీడల్లో షూటింగ్ విభాగంలో దేశానికి మరో రెండు పతకాలు చేరాయి. 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ వ్యక్తిగత విభాగంలోనూ భారత షూటర్లు పోటీపడ్డారు. అయితే ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్ ఐదో స్థానంలో, నిరాజ్ కుమార్ ఎనిమిదో స్థానంలో నిలిచారు. సురుచి, కమల్‌జీత్ సాధించిన స్వర్ణం ఆసియా క్రీడలు-2026లో భారత షూటింగ్ బృందానికి మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్‌లో ఆసియా రికార్డు స్కోరుతో స్వర్ణం సాధించడం ఈ ప్రదర్శనలో ప్రత్యేకంగా నిలిచింది.

# రుతురాజ్, నితీష్ ఇన్.. ఆ స్టార్లకు నో ఛాన్స్!

- విండీస్‌తో తొలి వన్డేకు బద్రీనాథ్ ఎంపిక చేసిన భారత తుది జట్టు
- రోహిత్-గిల్ ఓపెనర్లు.. మూడో స్థానంలో కోహ్లి
- యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్, నమన్ ధీర్‌కు చోటు లేదు
- పేస్ ఆల్‌రౌండర్‌గా నితీష్ కుమార్ రెడ్డికి అవకాశం
- సెప్టెంబర్ 27న తిరువనంతపురంలో తొలి వన్డే

**తిరువనంతపురం, సెప్టెంబర్ 25 (సమయం న్యూస్):** వెస్టిండీస్‌తో తొలి వన్డేలో టీమిండియా తుది జట్టు ఎలా ఉండబోతోంది..? రోహిత్‌తో కలిసి ఓపెనింగ్ చేసేది ఎవరు..? రుతురాజ్ గైక్వాడ్‌కు అవకాశం దక్కుతుందా..? నితీష్ కుమార్ రెడ్డిని తుది జట్టులోకి తీసుకుంటారా..? ఈ ప్రశ్నల మధ్య భారత మాజీ క్రికెటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ తన అంచనా జట్టును ప్రకటించాడు. యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్, నమన్ ధీర్, ఆకిబ్ నబీలను పక్కనపెట్టి రుతురాజ్, నితీష్‌లకు తన పదకొండు మందిలో చోటిచ్చాడు. భారత్-వెస్టిండీస్ మధ్య మూడు వన్డేల సిరీస్ సెప్టెంబర్ 27న తిరువనంతపురంలోని గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ స్టేడియంలో ప్రారంభం కానుంది. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో భారత్ బరిలోకి దిగనుండగా, కేఎల్ రాహుల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి కూడా వన్డే జట్టులో ఉన్నారు.

### రోహిత్-గిల్‌తో మొదలు

బద్రీనాథ్ తన అంచనా జట్టులో రోహిత్ శర్మ, కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను ఓపెనర్లుగా ఎంచుకున్నాడు. మూడో స్థానంలో విరాట్ కోహ్లి, నాలుగో స్థానంలో రుతురాజ్ గైక్వాడ్‌ను ఎంపిక చేశాడు. వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్‌కు ఐదో స్థానం ఇచ్చాడు. ఆసియా క్రీడల్లో పాల్గొంటున్న శ్రేయస్ అయ్యర్ వన్డే జట్టులో లేకపోవడంతో రుతురాజ్ తిరిగి జట్టులోకి వచ్చాడు.

### నితీష్‌కు కీలక బాధ్యత

ఫాస్ట్ బౌలింగ్ ఆల్‌రౌండర్ పాత్ర కోసం నితీష్ కుమార్ రెడ్డిని బద్రీనాథ్ ఎంచుకున్నాడు. వాస్తవానికి నితీష్‌ను తొలుత ఆసియా క్రీడల జట్టులో ఎంపిక చేసినప్పటికీ, ఆ తర్వాత అతడిని ఆ జట్టు నుంచి తప్పించి వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు అందుబాటులో ఉంచారు.

### జడేజా రీఎంట్రీ.. కుల్దీప్‌కు చోటు

సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాను ఏడో స్థానంలో తీసుకున్న బద్రీనాథ్.. ప్రధాన స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్‌ను ఎంచుకున్నాడు. పేస్ విభాగంలో ప్రసిద్ధ్ కృష్ణ, మహమ్మద్ సిరాజ్, గుర్నూర్ బ్రార్‌లకు అవకాశం ఇచ్చాడు. యువ పేసర్ ఆకిబ్ నబీని మాత్రం తన తుది జట్టులోకి తీసుకోలేదు.

### యశస్వి, జురెల్‌కు నిరాశ

బద్రీనాథ్ ఎంపికలో ప్రధానంగా యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్, నమన్ ధీర్, ఆకిబ్ నబీలకు చోటు దక్కలేదు. అయితే ఇది బద్రీనాథ్ అంచనా వేసిన జట్టు మాత్రమే. తొలి వన్డేకు అధికారిక తుది జట్టును టీమ్ మేనేజ్‌మెంట్ మ్యాచ్ రోజు ప్రకటిస్తుంది. భారత అధికారిక వన్డే జట్టులో ఈ నలుగురూ ఉన్నారు.

### బద్రీనాథ్ అంచనా తుది జట్టు

రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్, నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, మహమ్మద్ సిరాజ్, గుర్నూర్ బ్రార్. విండీస్‌తో తొలి వన్డేకు బద్రీనాథ్ అంచనా జట్టు.. నితీష్ కుమార్ రెడ్డికీ చోటు




# జోష్నాకు ఆరో పతకం

**నగోయా, సెప్టెంబరు 25 (సమయం న్యూస్):** భారత స్క్వాష్ స్టార్ జోష్నా చినప్ప అరుదైన ఘనత సాధించారు. వరుసగా ఏడోసారి ఏషియన్ గేమ్స్‌లో పాల్గొంటున్న 40 ఏళ్ల జోష్నా.. ఈసారి మిక్స్‌డ్ డబుల్స్‌లో పతకాన్ని ఖాయం చేసుకున్నారు. వెలవన్ సెంథిల్‌కుమార్‌తో కలిసి సెమీఫైనల్‌కు చేరడం ద్వారా ఆమె కెరీర్‌లో ఆరో ఏషియన్ గేమ్స్ పతకం ఖాయమైంది. దీంతో వరుసగా ఏడు ఏషియన్ గేమ్స్‌లో పాల్గొన్న తొలి భారతీయురాలిగా ఇప్పటికే రికార్డు సృష్టించిన జోష్నా.. ఇప్పుడు తన పతకాల సంఖ్యను ఆరుకు పెంచుకోనున్నారు.

### ఫిలిప్పీన్స్ జోడీపై విజయం

మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో జోష్నా-వెలవన్ జోడీ ఫిలిప్పీన్స్‌కు చెందిన డేవిడ్ పెలినో-జెమికా అరిబాడో జోడీతో తలపడింది. భారత జోడీ ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. కేవలం అరగంటలోపే మ్యాచ్‌ను ముగిస్తూ 11-3, 11-5తో వరుస గేముల్లో విజయం సాధించింది. తొలి గేమ్‌ను తొమ్మిది నిమిషాల్లో, రెండో గేమ్‌ను పది నిమిషాల్లో గెలిచిన భారత జోడీ.. సెమీఫైనల్ బెర్త్‌తో పాటు కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంది. జోష్నా అనుభవం, వెలవన్ సెంథిల్‌కుమార్ దూకుడు భారత జోడీ విజయానికి కీలకంగా నిలిచాయి. ప్రత్యర్థులు పుంజుకునేందుకు ప్రయత్నించినప్పటికీ.. భారత ఆటగాళ్లు ఆధిపత్యాన్ని కొనసాగించారు. మ్యాచ్ ప్రారంభం నుంచి చివరి పాయింట్ వరకు వ్యూహాన్ని సమర్థంగా అమలు చేసి విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఇప్పటివరకు ఆరు ఏషియన్ గేమ్స్‌లో పాల్గొన్న భారత స్క్వాష్ దిగ్గజం సౌరవ్ ఘోషల్ రికార్డును కూడా జోష్నా అధిగమించారు. 2002 నుంచి వరుసగా ఏడు క్రీడల్లో పాల్గొనడం ద్వారా భారత క్రీడా చరిత్రలో ప్రత్యేక గుర్తింపు పొందారు. సెమీఫైనల్లో జోష్నా-వెలవన్ జోడీ హాంకాంగ్‌కు చెందిన యో కా లీ-మింగ్ హాంగ్ టాంగ్ జోడీతో తలపడనుంది. ఈ మ్యాచ్ శనివారం జరగనుంది. ఇప్పటికే పతకం ఖాయం చేసుకున్న భారత జోడీ.. సెమీఫైనల్లో విజయం సాధిస్తే ఫైనల్‌కు చేరి స్వర్ణం లేదా రజతం కోసం పోటీ పడుతుంది. 40 ఏళ్ల వయసులోనూ అంతర్జాతీయ స్థాయిలో జోష్నా తన ప్రదర్శనను కొనసాగిస్తున్నారు. దేశం కోసం పతకం గెలవడం తన కెరీర్‌లో ఎప్పటికీ ప్రత్యేకమైన ప్రేరణ అని ఆమె పేర్కొన్నారు. తాజా విజయంతో 16 ఏళ్ల విరామం తర్వాత ఏషియన్ గేమ్స్‌లో మరో పతకాన్ని ఖాయం చేసుకున్నారు.





# వయసుపై వస్తున్న రూమర్స్‌కు వైష్ణవి చైతన్య చెక్

**హైదరాబాద్, సెప్టెంబరు 25 (సమయం న్యూస్):** టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ వైష్ణవి చైతన్య తన వయసుపై వస్తున్న రూమర్స్‌కు చెక్ పెట్టారు. యూట్యూబర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆమె షార్ట్ ఫిలింస్, వెబ్ సిరీస్‌ల ద్వారా గుర్తింపు తెచ్చుకున్నారు. అనంతరం సినిమాల్లోకి అడుగుపెట్టి 'అల వైకుంఠపురములో', 'రంగ్ దే', 'టక్ జగదీష్', 'వరుడు కావలెను' వంటి చిత్రాల్లో సహాయక పాత్రల్లో నటించారు. 'బేబీ' సినిమాతో హీరోయిన్‌గా అరంగేట్రం చేసిన వైష్ణవి.. ఆ చిత్రంతో ఒక్కసారిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత 'లవ్ మీ', 'జాక్' చిత్రాల్లో కథానాయికగా నటించారు. ఇటీవల ఆనంద్ దేవరకొండతో కలిసి 'ఎపిక్' సినిమాలో కనిపించారు. సెప్టెంబరు 11న విడుదలైన ఈ సినిమా ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన అందుకుంది. 'ఎపిక్' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న వైష్ణవిని యాంకర్ ఆమె వయసుపై ప్రశ్నించారు. వికీపీడియాలో తన వయసు 32 ఏళ్లుగా ఉందని, అయినప్పటికీ 25 ఏళ్ల అమ్మాయిలా కనిపిస్తున్నారని.. అందుకు కారణం ఏమిటని అడిగారు. దీనికి స్పందించిన వైష్ణవి.. వికీపీడియాలో తన వయసుతో పాటు పుట్టిన ప్రదేశానికి సంబంధించిన వివరాలు కూడా తప్పుగా ఉన్నాయని స్పష్టం చేశారు. తన వయసు 25 ఏళ్లు మాత్రమేనని వైష్ణవి తెలిపారు. ఇదే ఇంటర్వ్యూలో యాంకర్ ఆధార్ కార్డు ఫొటో చూపించగలరా అని అడగ్గా.. వైష్ణవి తన మొబైల్‌లో ఉన్న ఆధార్ చిత్రాన్ని చూపించినట్లు సమాచారం. అందులో ఆమె పుట్టిన సంవత్సరం 2001గా ఉందని తెలుస్తోంది. దీంతో వైష్ణవి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# కాయదుకు వరుస పరాజయాలు


**హైదరాబాద్, సెప్టెంబరు 25 (సమయం న్యూస్):** కన్నడ చిత్రం 'ముగిల్‌పేట'తో సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన కాయదు లోహార్‌కు వరుస పరాజయాలు ఎదురవుతున్నాయి. గ్లామర్‌తో పాటు నటనతోనూ ఆకట్టుకునే అవకాశం ఉన్న ఈ భామకు మంచి అవకాశాలు వస్తున్నప్పటికీ.. అవి మాత్రం ఆశించిన విజయాలను అందించలేకపోతున్నాయి. ముఖ్యంగా తెలుగు చిత్రసీమలో ఆమె నటించిన సినిమాలు వరుసగా నిరాశపరచడంతో కెరీర్‌పై ప్రభావం పడుతోంది. శ్రీవిష్ణు సరసన నటించిన 'అల్లూరి'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన కాయదు.. ఆ తర్వాత 'ఫంకీ'లోనూ కనిపించింది. అయితే ఈ రెండు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. దీంతో వరుసగా సినిమాలు చేస్తున్నా.. ఖాతాలో చెప్పుకోదగ్గ కమర్షియల్ హిట్ లేకపోవడం ఆమెకు ప్రతికూలంగా మారింది.

### 'ది ప్యారడైజ్'తోనూ నిరాశే..

నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కిన 'ది ప్యారడైజ్'లో కాయదుకు అవకాశం లభించింది. అయితే ఈ సినిమాలో ఆమె పోషించిన పాత్రపై ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన వచ్చింది. తండ్రి చేసిన అప్పులను తీర్చే క్రమంలో బి-గ్రేడ్ చిత్రాల్లో నటించే యువతిగా ఆమె పాత్రను తీర్చిదిద్దారు. ఈ పాత్ర ఎంపికపై కొందరు ప్రేక్షకులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

### కథల ఎంపికపై దృష్టి అవసరం

గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలు ఎంచుకునే అవకాశం కాయదు లోహార్‌కు ఉందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే కథ, పాత్రల ఎంపిక విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మంచి అవకాశాలను విజయాలుగా మలుచుకుని, తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడం కాయదు కెరీర్‌లో కీలకంగా మారనుంది.



# 'సిగ్మా'లో మంచి ఎమోషనల్ క్యారెక్టర్: ఫరియా

హైదరాబాద్, సెప్టెంబరు 25 (సమయం న్యూస్): సందీప్ కిషన్ హీరోగా జేసన్ సంజయ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'సిగ్మా' చిత్రంలో ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటించారు. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మించిన ఈ సినిమా అక్టోబరు 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఫరియా మీడియాతో మాట్లాడారు. 'సిగ్మా'లో తాను రేడియో జాకీ పాత్రలో కనిపిస్తానని ఫరియా తెలిపారు. తన పాత్రలో అన్ని రకాల భావోద్వేగాలను చూపించే అవకాశం లభించిందని చెప్పారు. యాక్షన్, అడ్వెంచర్, కామెడీ అంశాలతో రూపొందిన ఈ చిత్రాన్ని కుటుంబంతో కలిసి హాయిగా చూడొచ్చని పేర్కొన్నారు. సందీప్ కిషన్‌తో కలిసి సినిమా చేయాలని చాలా కాలంగా అనుకుంటున్నామని, చివరకు 'సిగ్మా'తో ఆ అవకాశం వచ్చిందని ఫరియా వెల్లడించారు. దర్శకుడు జేసన్ సంజయ్ జూమ్ కాల్‌లో కథ చెప్పారని, కథ విన్న తర్వాత ఆయన వయసు అడిగితే 24 ఏళ్లని చెప్పారని గుర్తుచేసుకున్నారు. తొలి సినిమా అయినప్పటికీ జేసన్ ఎంతో స్పష్టత, విజన్‌తో చిత్రాన్ని తెరకెక్కించారని ఫరియా ప్రశంసించారు. సూపర్‌స్టార్ విజయ్ కుమారుడనే భావన ఆయనలో ఏమాత్రం కనిపించదని, చాలా వినయంగా, స్నేహపూర్వకంగా ఉంటారని అన్నారు. 'సిగ్మా' లాంటి మంచి ప్రాజెక్ట్‌తో తమిళ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టడం ఆనందంగా ఉందని, తమన్ అందించిన నేపథ్య సంగీతం, పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని ఫరియా పేర్కొన్నారు.



# 'లవ్ అండ్ వార్'లో ఆలియా భట్ ఫస్ట్ లుక్

హైదరాబాద్, సెప్టెంబరు 25 (సమయం న్యూస్): బాలీవుడ్ మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ 'లవ్ అండ్ వార్' నుంచి వరుస అప్‌డేట్స్ వస్తున్నాయి. ఇప్పటికే రణ్‌బీర్ కపూర్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేసిన చిత్రబృందం.. తాజాగా ఆలియా భట్ ఫస్ట్ లుక్‌ను కూడా అభిమానులతో పంచుకుంది. ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'ఆగ్ భీ, దిల్ కీ జాన్ భీ!' అనే క్యాప్షన్‌తో విడుదల చేసిన ఆలియా భట్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రేమ, భావోద్వేగాలతో పాటు యాక్షన్ అంశాలను మేళవించి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్‌తో పాటు విక్కీ కౌశల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. స్టార్ హీరోహీరోయిన్ల కాంబినేషన్‌కు భన్సాలీ దర్శకత్వం తోడవడంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే 'లవ్ అండ్ వార్' 2027 జనవరి 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.




Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**